
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
5
సోమవారం 6 జనవరి 2025





గుంటూరులో ప్రథమ బహుమతి పొందిన చౌడం విజయలక్ష్మికి రూ.6వేల నగదు అందజేస్తున్న టీడీపీ సీనియర్ నేత కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానసకు రూ.6 వేలు అందజేస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి ఎస్ సాంబశివరావు, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందనకు రూ.6 వేల నగదు అందజేస్తున్న శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులు

ముగ్గులు మురిశాయి

- ఆంధ్రజ్యోతి ముగ్గులతో ఇలపై ఇంద్రధనస్సు
- రంగవల్లులతో రంగులమయమైన ప్రాంగణాలు
- ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా సందడి
- గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు
- చిన్నారుల నుంచి వృద్ధుల వరకు పెద్దసంఖ్యలో హాజరు

రంగు రంగుల రంగవల్లులతో భూమాత పులకరించగా.. ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలతో ఇలపై ఇంద్రధనస్సు ఆవిష్కృతమైంది. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో పోటీలు జరగ్గా చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తీర్చిదిద్దిన ముగ్గులు మురిశాయి. ముందుగానే సంక్రాంతి వచ్చేసిందన్నట్లుగా ఆయా ప్రాంగణాల్లో సందడి నెలకొంది. గుంటూరులో పోటీలకు 220 మంది, తెనాలిలో 142 మంది, నరసరావుపేటలో 110 మంది వరకు హాజరై తమ ముగ్గు నైపుణ్యాన్ని ప్రదర్శించారు. సంప్రదాయ రీతిలో గొబ్బెమ్మలు.. గంగిరెద్దులు, నవధాన్యాలు, చెరుకుగడలు, పాలపొంగులు, హరిదాసులు, రైతుల బొమ్మలు, పూలతో అలంకరించిన ముగ్గులు చూపురులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సారి విద్యార్థినులు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనగా.. ఈ పోటీలతో మనదైన సంస్కృతి, సంప్రదాయాన్ని ఒక తరం నుంచి మరో తరం అందిపుచ్చుకునేలా ఆంధ్రజ్యోతి ఈ కార్యక్రమం నిర్వహించిందని అతిథులు, హాజరైన వారు అభిప్రాయపడ్డారు.

గుంటూరు(విద్య), తెనాలి అర్బన్, నరసరావుపేట కల్చరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ముగ్గులను తీర్చిదిద్దేందుకు చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ఉత్సాహంగా ముందుకు రావడంతో ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు అనూహ్య స్పందన కనిపించింది. గుంటూరు, తెనాలి, నరసరావుపేటల్లో పోటీలు జరిగ్గా ఆయా ప్రాంతాల్లో సంక్రాంతికి ముందే పండుగ వాతావరణం నెలకొంది. ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్‌వారి పర్‌ఫెక్ట్. ఫ్యాషన్ పార్టనర్ డిగోసెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు గుంటూరులో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ అంగలకుదురు, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా స్పాన్సర్లుగా వ్యవహరించారు. పోటీలు గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగినా చుట్టుపక్కల గ్రామాలతో పాటు సమీప జిల్లాలకు చెందిన వారు కూడా పెద్దసంఖ్యలో హాజరయ్యారు. మంచు, చలిగాలులను సైతం లెక్క చేయకుండా పదుల కిలోమీటర్ల దూరం నుంచి మహిళలు ఉదయం 9 గంటలకే ఆయా కేంద్రాలకు చేరుకుని ఉత్సాహంగా ముగ్గులను తీర్చిదిద్దారు. ముగ్గులను తిలకించేందుకు ఆయా ప్రాంతాలకు చెందిన వారు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. వివిధ కళాశాలల విద్యార్థులు కూడా ఉత్సాహంగా పాల్గొని రంగవల్లులపై మక్కువ చూపారు. సంప్రదాయాలను మేళవిస్తూ.. వినూత్నంగా.. విభిన్నంగా.. సందేశాత్మకంగా మహిళలు ముగ్గులను తీర్చిదిద్దడంతో విజేతల ఎంపికకు న్యాయనిర్ణేతలు శ్రమపడాల్సి వచ్చింది. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన వారికి రూ.6 వేలు, రూ.4 వేలు, రూ.3 వేల నగదుతో పాటు కన్సొలేషన్ బహుమతులతో పాటు పాల్గొన్న వారందరికీ ప్రత్యేక గిఫ్టులను గుంటూరులో కుర్రా అప్పారావు, తెనాలిలో గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, నరసరావుపేటలో మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తా, అనురాధగుప్తాలు అందజేశారు. గుంటూరులో ఒకవైపు మహిళలు ముగ్గులు తీర్చిదిద్దుతూ తమ నైపుణ్యాలను ప్రదర్శించేందుకు పోటీపడగా వారి పిల్లలు, మరికొందరు మహిళలు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

మహిళా నైపుణ్యాలకు ముగ్గులు దర్పణం : కుర్రా అప్పారావు

గుంటూరులోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు మాట్లాడుతూ మహిళల్లోని నైపుణ్యాలకు ముగ్గులు దర్పణంగా నిలిచాయని ప్రశంసించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్కరించుకుని ఏటా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. సంస్కృతి, సంప్రదాయాల్ని ప్రోత్సహించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.

ముగ్గులతో ఆరోగ్యం : వీరవల్లి మురళి

తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన పోటీ ఉత్సాహ పూరిత వాతావరణంలో జరిగింది. పోటాపోటీగా మహిళలు ముగ్గులు తీర్చిదిద్దడంతో నగదు బహుమతులతో పాటు ప్రత్యేకంగా పట్టుచీరలు అందజేశారు. గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మొదటి ముగ్గురితో పాటు

(మిగతా 6వ పేజీలో)

విజేతలు

గుంటూరు
1. సీహెచ్ విజయలక్ష్మి
2. పీ.పూజిత
3. కే.చందన

కన్సొలేషన్: సునీత, శ్రీలత, మాధవీలత, గీజాంజలి, మాధవి

తెనాలి
1. కే.మానస
2. ఎస్.లక్ష్మీతిరుపతమ్మ
3. పీ.సాయిచైతన్య

నరసరావుపేట
1. కుమ్మరి చందన
2. ఏ.నాగజ్యోతి
3. పాపన సుజాత

కన్సొలేషన్ : మచ్చా మాధవి, బాపతు లావణ్య, గ్రంధి సురేఖ, మట్రం లక్ష్మీతిరుపతమ్మ



గుంటూరులో ప్రథమ బహుమతి సాధించిన చౌడం విజయలక్ష్మి వేసిన ముగ్గు



తెనాలిలో ప్రథమ బహుమతి పొందిన కే మానస వేసిన ముగ్గు



నరసరావుపేటలో ప్రథమ బహుమతి పొందిన కుమ్మరి చందన వేసిన ముగ్గు



తెనాలి : బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



గుంటూరు : ఎన్టీఆర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



నరసరావుపేట : ఎస్ఎస్ఎన్ కళాశాల ప్రాంగణంలో ముగ్గులను తీర్చిదిద్దుతున్న మహిళలు



టీడీపీ నేతలపై దాడి చేసిన **తురకా కిశోర్ అరెస్టు**

-వివరాలు మెయిన్‌లో



సంక్రాంతికి గుంటూరు మీదుగా **ప్రత్యేక రైళ్లు**

6

ఒక్క రోజు తనిఖీలతో రూ.26.32 లక్షలు

వాణిజ్య పన్నులశాఖకు స్వేచ్ఛ ఇస్తే ఇంకెంత ఆదాయమో?

- గ్రానైట్ అక్రమ రవాణాను అడ్డుకుంటే నెలకు రూ.కోట్లలో రాబడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఒక్కరోజు తనిఖీలతో రూ.26.32 లక్షల ఆదాయం. మరి ఇదే రోజు వారీగా చేస్తే.. అలా చేసేందుకు అధికారులు స్వేచ్ఛ ఇస్తే ప్రభుత్వ ఆదాయం రూ.కోట్లలో ఉంటుందా అంటే శనివారం నరసరావుపేటలో చోటుచేసుకున్న పరిణామాలు చూస్తే అవుననంటున్నాయి. పల్నాడు జిల్లా నుంచి గ్రానైట్ అక్రమ రవాణా పెద్దఎత్తున జరుగుతుండగా ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయం అధికార పార్టీ నేతల జేబుల్లోకి వెళుతుంది. ఎటువంటి పన్నులు చెల్లించకుండానే ప్రతి నెల వందలాది లారీల గ్రానైట్ జిల్లా గుండా ఇతర రాష్ట్రాలకు తరలిపోతోంది. శనివారం జిల్లాలో విస్తృతంగా వాణిజ్య పన్నుల శాఖ అధికారులు నిర్వహించిన తనిఖీల్లో గ్రానైట్ అక్రమ రవాణా గుట్టురట్టయింది. ఇతర రాష్ట్రాలను గ్రానైట్ రవాణా చేస్తున్న 14 లారీలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఒక్కొక్క లారీ నిర్వాహకుడి నుంచి రూ.80 వేలు జరిమానా, అలాగే పన్ను రూపంలో మరో రూ.15.12 లక్షలు, వెరసి రూ 26.32 లక్షలు వసూలు చేశారు. ఈ లారీలు బాపట్ల జిల్లా మార్టూరు, బల్లికురవ గ్రానైట్ కంపెనీల నుంచి వచ్చినట్లు అధికారుల తనిఖీల్లో వెల్లడైంది. పన్నులు చెల్లించకుండా మహారాష్ట్రకు తరలిపోతున్నాయని అధికారులు తెలిపారు.

మిన్నకున్న మైనింగ్ శాఖ

వాణిజ్య పన్నుల శాఖ అధికారులు లారీలను స్వాధీనం చేసుకున్న సమాచారాన్ని మైనింగ్‌శాఖకు తెలిపారు. లారీల్లోని గ్రానైట్‌కు రాయల్టీ చెల్లించారా లేదా అన్న అంశాన్ని మైనింగ్ శాఖ పరిశీలించాలి. లారీల్లో గ్రానైట్ కొలతలు తీసి రాయల్టీ వసూలు చేయాలి. అయితే సదరు అధికారులు ఆదివారం వరకు కూడా చర్యలు తీసుకోకుండా మిన్నకున్నారు. లారీల్లోని గ్రానైట్ పరిశీలనకే మైనింగ్ శాఖ అధికారులు పరిమితమయ్యారు. కొలతలు తీసి రాయల్టీ వసూలు చేసే ప్రయత్నం చేయకపోవడంతో విమర్శలకు దారితీసింది.

అధికారులపై ఒత్తిళ్లు

వాణిజ్య పన్నుల శాఖ స్వాధీనం చేసుకున్న లారీలను వదిలేయాలని కొందరు నేతలు అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిళ్లు తెచ్చినట్టు సమాచారం. జాయింట్ కమిషనర్ ఆదేశాలతో తనిఖీలు నిర్వహించిన అధికారులు నేతల ఒత్తిళ్లకు తలొగ్గకుండా జరిమానాలు విధించారు. గ్రానైట్ అక్రమ రవాణాకు సహకరిస్తూ కొందరు నేతలు నెలకు రూ.లక్షల్లో ఆదాయాన్ని పొందుతున్నారనే ఆరోపణలున్నాయి.



వాణిజ్య పన్నులశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్న గ్రానైట్ లారీలు

32 మంది సిబ్బంది రీకాల్

- మేయర్, డిప్యూటీ మేయర్‌లకు షాక్
- వారి వాహనాలకు ఆయిల్ కూడా నిలిపివేత
- జీఎంసీలో రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశాలు

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరపాలక సంస్థ మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు(డైమండ్‌బాబు)ల వద్ద ఉన్న కార్పొరేషన్ సిబ్బందిని వెనక్కి పిలుస్తూ కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశాలు జారీ చేశారు. మేయర్ వద్ద 20 మంది ఉద్యోగులు, డిప్యూటీ మేయర్ వద్ద 12 మంది ఉద్యోగులు అనధికారికంగా వినియోగించుకుంటున్నట్లు అధికారుల పరిశీలనలో తేలింది. దీంతో నగరపాలక సంస్థకు రిపోర్టు చేయాలని ఆయా ఉద్యోగులను కమిషనర్ ఆదేశించారు. శనివారం కౌన్సిల్‌లో చోటుచేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఆదివారం కమిషనర్ నిర్ణయంతో మేయర్, డిప్యూటీ మేయర్లు షాక్‌కు గురైనట్లు తెలిసింది. నాలుగేళ్లుగా ఇష్టారాజ్యంగా మున్సిపల్ ఉద్యోగులను వారిద్దరూ వాడుకున్నట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ క్రమంలో అనధికార విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి కమిషనర్ మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ కూపన్లు కూడా ఇష్టం వచ్చినట్లు వాడుకుంటున్నట్లు జీఎంసీ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. తన అనుమతి లేకుండా ఆయిల్‌ను కూడా ఎలాపడితే అలా వినియోగించుకోవడానికి వీలులేదని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో నిబంధల ప్రకారమే ఇక నుంచి సిబ్బంది, వాహనాలకు ఆయిల్ కేటాయించనున్నట్టు జీఎంసీ అధికారులు తెలిపారు.

ముగ్గులు.. మురిశాయి



తెనాలి: ముగ్గులను పరిశీలిస్తున్న మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి, గణేష్ యూత్ మురళి, న్యాయనిర్ణేతలు



నరసరావుపేట: ముగ్గులను పరిశీలిస్తున్న స్పాన్సరర్స్ శారదాంబ జ్యూయలర్స్ అధినేత, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగసరపు సుబ్బారాయగుప్తా, అనురాధ



గుంటూరు: ముగ్గులను పరిశీలిస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు, ఆంధ్రజ్యోతి బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు తదితరులు

(5వ పేజీ తరువాయి)

15 మందికి నాలుగో, 25 మందికి ఐదో, మరో 60 మందికి ప్రోత్సాహక బహుమతలను గణేష్ యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కె.విష్ణు, గుమ్మడి రవీంద్రలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వీరవల్లి మురళి మాట్లాడుతూ సంక్రాంతి సంస్కృతిని భావితరాలకు అందించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనసుకు ఆహ్లాదం కూడా కలుగుతుందన్నారు. చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, సంక్రాంతి సంబరం ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిందని, ఓర్పుతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ముచ్చట గొలిపాయన్నారు. ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు పోటీలను పర్యవేక్షించారు.

ఆంధ్రజ్యోతి ప్రయత్నం అభినందనీయం : సుబ్బరాయగుప్తా

నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాలలో జరగిన ముగ్గుల పోటీలతో ఆ ప్రాంగణంలో సంక్రాంతి సందడి నెలకొంది. బహుతుల ప్రధానోత్సవ సభలో మాజీ మున్సిపల్ చైర్మన్, శారదాంబ జ్యూయలర్స్ అధినేత నాగసరపు సుబ్బరాయగుప్తా మాటాడుతూ అపార్టుమెంట్ల సంస్కృతి రావడంతో ఇళ్ల ముందు ముగ్గులేసే సంప్రదాయం నానాటికీ కనుమరుగవుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో ఆంధ్రజ్యోతి పత్రిక సామాజిక బాధ్యతతో 15 ఏళ్లుగా ముగ్గుల పోటీ నిర్వహిస్తు, మన సంస్కృతిని కాపాడుతుండటం అభినందనీయమన్నారు. అనురాధాగుప్తా మాట్లాడుతూ ఇంటికి దీపం ఇల్లాలు ఎలాగో ఇంటి ముందు ముగ్గు ఇంటికి అందం అన్నారు.



గుంటూరులో ముగ్గుల పోటీలో పాల్గొన్న వారికి భోజనాలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు



గుంటూరులో ముగ్గుల పోటీలు సందర్భంగా చిన్నారుల నృత్యం



తెనాలిలో మగ్గుల పోటీలకు వచ్చిన మహిళలు



తెనాలిలో నాలుగో బహుమతి అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి

సంక్రాంతికి గుంటూరు మీదుగా ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ సెలవుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదుగా పలు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఆదివారం తెలిపారు. నంబరు. 07037 వికారబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 13వ తేదీన రాత్రి 7.40కి బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి, గుంటూరు మీదగా 14వ తేదీ ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07038 కాకినాడటౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 14వ తేదీన రాత్రి 8.30కి బయలుదేరి గుంటూరు మీదుగా 15వ తేదీ ఉదయం 8.30కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07035 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07036 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 11, 18 తేదీల్లో రాత్రి 7.15కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07078 సికింద్రాబాద్ - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో ఉదయం 10.05 గంటలకు బయలుదేరి గుంటూరు మీదుగా అదే రోజు రాత్రి 7.30 గంటలకు కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07079 కాకినాడ టౌన్ - సికింద్రాబాద్ రైలు ఈ నెల 12, 19 తేదీల్లో రాత్రి 10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.30కి సికింద్రాబాద్ చేరుకొంటుంది. నంబరు. 07033 చర్లపల్లి - నరసపూర్ రైలు ఈ నెల 7, 9, 13, 15, 17 తేదీల్లో రాత్రి 7.30కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 5.50కి నరసపూర్ చేరుకొంటుంది. నంబరు. 07034 నరసపూర్ - చర్లపల్లి రైలు ఈ నెల 8, 10, 14, 16, 18 తేదీల్లో రాత్రి 8 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07031 చర్లపల్లి - కాకినాడ టౌన్ రైలు ఈ నెల 8, 10, 12, 14 తేదీల్లో రాత్రి 9.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8.30కి కాకినాడ టౌన్‌కు చేరుకొంటుంది. నంబరు. 07032 కాకినాడ టౌన్ - చర్లపల్లి రైలు ఈ నెల 9, 11, 13, 15 తేదీల్లో రాత్రి 8.30కి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 8.35కి చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07025 చర్లపల్లి - శ్రీకాకుళం రోడ్డు రైలు ఈ నెల 9, 12, 14 తేదీల్లో రాత్రి 7.20కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 9 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు చేరుకొంటుంది. నంబరు. 07026 శ్రీకాకుళం రోడ్డు - చర్లపల్లి రైలు ఈ నెల 10, 13, 15 తేదీల్లో మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 6 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది. నంబరు. 07041 కాచీగూడ - శ్రీకాకుళం రోడ్డు ఈ నెల 7వ తేదీన రాత్రి 7.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 8 గంటలకు శ్రీకాకుళం రోడ్డుకు, నంబరు. 07042 శ్రీకాకుళం రోడ్డు - కాచీగూడ రైలు ఈ నెల 8వ తేదీన మధ్యాహ్నం 2.45కి బయలుదేరి గుంటూరు మీదుగా మరుసటి రోజు ఉదయం 7.30కి చర్లపల్లి చేరుకొంటుందని సీపీఆర్‌వో తెలిపారు. నేడు, రేపు రెండు ప్రత్యేక రైళ్లు: సోమ, మంగళవారాల్లో గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు తెలిపారు. నంబరు. 07077 చర్లపల్లి - తిరుపతి రైలు ఈ నెల 6వ తేదీన(సోమవారం) మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి నడికుడి, పిడుగురాళ్ల, సత్తెనపల్లి మీదుగా రాత్రి 7.45కి గుంటూరు, ఆ తర్వాత తెనాలి, బాపట్ల, చీరాల మీదుగా ప్రయాణించి మంగళవారం వేకువజామున 4 గంటలకు తిరుపతి చేరుకొంటుంది. నంబరు. 07078 తిరుపతి - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 7వ తేదీ మంగళవారం రాత్రి 8 గంటలకు తిరుపతిలో బయలుదేరి అర్ధరాత్రి దాటాక 2.30కి గుంటూరుకి వచ్చి సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా బుధవారం చర్లపల్లి చేరుకొంటుంది.





మోగిన శంఖం



కదంతొక్కిన హైందవ సోదరులు.. కాషాయమయమైన కేసరపల్లి

భారతీయ సంస్కృతీ, సంప్రదాయం, సనాతన ధర్మం, ఆధ్యాత్మికతను భవిష్యత్ తరాలకు చాటిచెప్పే ఉద్దేశంతో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లాలోని గన్నవరం మండలం కేసరపల్లిలో ఆదివారం హైందవ శంఖారావం భారీ బహిరంగ సభ నిర్వహించారు. రాష్ట్ర నలుమూలల నుంచి హిందువులు పెద్ద ఎత్తున తరలి రావడంతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. దేశవ్యాప్తంగా కీర్తి గడించిన ఎందరో హైందవ నేతలు తమ ప్రసంగాల్లో హిందూధర్మం గొప్పతనాన్ని చాటిచెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి హైందవ సోదరులు ర్యాలీలుగా తరలివచ్చారు. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

సభా ప్రాంగణానికి వెళ్తున్న హిందువులు







సభలో ప్రసంగిస్తున్న గణపతి సచ్చిదానంద స్వామి, గోవింద్ దేవ్ గిరిజి మహరాజ్, స్వామి కమలానంద, స్వామి వరదానంద

హిందూ సోదరులతో కిక్కిరిసిన కేసరపల్లిలోని సభా ప్రాంగణం



మాజీ సైనికుల కార్పొరేషన్ ఏర్పాటు హామీపై హర్షం

మంగళగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏపీలో మాజీ సైనికుల సంక్షేమం కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రకటించడంపై మాజీ సైనికుల సంక్షేమ సంఘం హర్షం వెలిబుచ్చింది. మంగళగిరి ఏపీఎస్పీ ఆరో పటాలంలో మాజీ సైనిక సంఘాల రాష్ట్ర స్థాయి సమావేశం ఆదివారం జరిగింది. మాజీ సైనిక సంఘం జిల్లా అధ్యక్షుడు కె.గోవిందరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మాజీ సైనిక సంఘాలు అనేకం ఉన్నాయని, వీటన్నింటినీ ఒకతాటిపైకి తీసుకువచ్చి ఒక రాష్ట్రం, ఒకే మాజీ సైనికుల సంక్షేమ సంఘం ఉండాలనే ఉద్దేశంతో ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మరో మూడు నెలల్లో సంఘాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. మాజీ సైనికుల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తూ తీర్మానించారు. సమావేశంలో మంగళగిరి వెటరన్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు శంకర్‌రెడ్డి, బాపట్ల జిల్లా అధ్యక్షుడు తాండ్ర సాంబశివరావు, శ్రీకాకుళం అధ్యక్షుడు కటకం పూర్ణచంద్రరావు, నేతలు సూరిరెడ్డి శివకుమార్, పి.విశ్వేశ్వరరావు, ఎస్ఎస్ రాముడు, ఎన్.నాగేశ్వరరావు, ఏపీ నాయుడు, అన్నె రామారావు, జి.కోటేశ్వరరావు, అడపా శంకర్, సీహెచ్ వెంకట అప్పారావు పాల్గొన్నారు.



సమావేశంలో మాజీ సైనిక సంఘాల ప్రతినిధులు

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది

కలెక్టరేట్ (కాకినాడ), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తి ఎంతో ఉన్నతమైనదని, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో వారి పాత్ర కీలకమైనదని ఎన్‌టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి డాక్టర్ ఐవీ రావు కొనియాడారు. కాకినాడ పీఆర్ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఆదివారం యూటీఎఫ్ స్వర్ణోత్సవ విద్యావైజ్ఞానిక మహాసభలు ఘనం గా ప్రారంభమయ్యాయి. ముఖ్యఅతిథి ఐవీ రావు మాట్లాడుతూ.. నేటితరం విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. వారిని సన్మార్గంలో పెట్టాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులదేనన్నారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ నేటి పాలకుల ఉదాసీన వైఖరి వల్ల రాజ్యాంగ లక్షణాలు మరుగున పడ్డాయని, వాటిని పరిరక్షించాల్సిన బాధ్యత యూటీఎఫ్ ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ విధానాలతో విద్య నానాటికీ కుంటుపడుతోందని, ఇప్పటికే దేశంలో సగం వరకు విద్యారంగం ప్రైవేటీకరణ జరిగిందని చెప్పారు. ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు దేశ భవిష్యత్తును నిర్దేశిస్తారన్నారు. ప్రభుత్వ రంగ పాఠశాలలను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ 1974 ఆగస్టు 10న యూటీఎఫ్ ఏర్పడిందని, యాభై ఏళ్లుగా పోరాటాల ద్వారా ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించిందని తెలిపారు. అఖిలభారత ఉపాధ్యాయ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి సీఎన్ భారతి మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలన్నారు. ఎమ్మె ల్సీ కేఎస్ లక్ష్మణరావు రాసిన నాలుగు పుస్తకాలను సభలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.వెంకటేశ్వర్లు, మాజీ అధ్యక్షుడు జోజయ్య, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు కె.సత్తిరాజు, బీవీ రాఘవులు, జి.చిట్టిబాబు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు రచించిన పుస్తకాలను యూటీఎఫ్ మహాసభల్లో ఆవిష్కరిస్తున్న అతిథులు

రేపటి నుంచి ఆన్‌లైన్‌లో ప్రజాభిప్రాయ సేకరణ

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విద్యుత్ వినియోగదారులకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ప్రతిపాదించిన వార్షిక ఆదాయ అవసరాలు, రిటైల్ ధరల కోసం ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీ ఈఆర్‌సీ) ఆధ్వర్యంలో విజయవాడ, కర్నూలు నుంచి బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించనున్నట్లు గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఇన్‌చార్జ్ ఎస్ఈ కేవీఎల్ఎన్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7, 8వ తేదీల్లో విజయవాడ బృందావన్ కాలనీ ఏ కన్వెన్షన్ సెంటర్‌లో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతుందన్నారు. అలానే ఈనెల 10వ తేదీన కర్నూలులో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వ్యక్తిగతంగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి 4.30 గంటల వరకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రజాభిప్రాయసేకరణ నిర్వహిస్తారన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి హాజరయ్యే వారు ముందుగానే తమ పేర్లను ఆన్‌లైన్‌లో ఏపీఈఆర్‌సీలో గానీ, గుంటూరు సంగడిగుంటలోని సర్కిల్ కార్యాలయంలో గానీ, గుంటూరు నల్లచెరువు, తెనాలి (చెంచుపేట) డివిజనల్ కార్యాలయంలోనైనా ముందుగానే నమోదు చేసుకొనే అవకాశం కల్పించినట్లు తెలిపారు. ఈ మూడు రోజుల్లో గుంటూరు సర్కిల్ కార్యాలయం, తెనాలి, గుంటూరు నల్లచెరువులోని డివిజనల్ కార్యాలయాల్లో వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం జరుగుతుందన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.00
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	113,121,132
చికెన్ విత్ స్కిన్	216.00
చికెన్ స్కిన్ లెస్	226.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

సమాజ చైతన్యానికి స్ఫూర్తి.. ఆంధ్రజ్యోతి

● సంప్రదాయాలను కాపాడుతూ ముగ్గుల పోటీల నిర్వహణ
● బహుమతి ప్రదానోత్సవంలో టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు

గుంటూరు(విద్య), జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఏబీఎన్ - ఆంధ్రజ్యోతి' సమాజంలో చెడుపై పోరాటం చేస్తూ నిత్యం ప్రజల్ని చైతన్యవంతం చేస్తోందని టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు తెలిపారు. ఆంధ్ర జ్యోతి, ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు... గార్డెనింగ్ పార్టనర్ క్రాఫ్ట్ వారి పర్‌ఫెక్ట్.. ఫ్యాషన్ పార్టనర్ డిగ్‌సెల్ వారి సెల్సియా(ట్రెండీ మహిళల ఇన్నర్‌వేర్) ఆధ్వర్యంలో గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో ఆదివారం జరిగాయి. ఈ పోటీలకు స్థానిక స్పాన్సర్‌గా టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు వ్యవహరించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేసే కార్య క్రమంలో ఆయన మాట్లాడుతూ సం స్కృతి, సంప్ర దాయాల్ని గౌరవించడంతోపాటు యువతులు, మహిళాల్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రజ్యోతి ముగ్గుల పోటీలు నిర్వహించడం హర్ష ణీయమన్నారు. తెలుగు లోగిళ్లలో పెద్ద పండుగైన సంక్రాంతిని పురస్క రించుకుని ఏటా ఆంధ్రజ్యోతి ముగ్గులు పోటీలు నిర్వహిస్తుందన్నారు. ఇందులో తాము భాగస్వాములు కావడం ఆనందంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో నిర్బంధాల్ని ధైర్యంగా ఎదుర్కొన్న 'ఆంధ్రజ్యోతి' ప్రజా పక్షం నిలిచిందన్నారు. ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ పత్రిక ద్వారా ప్రజల్లో చైతన్య స్ఫూర్తిని నింపుతూ ప్రజల పక్షం నిలిచారన్నారు. ఆడిటర్ దామచర్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యం, ఆనందం, ఆదాయం వంటి విషయాల్లో అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముగ్గుల పోటీలకు న్యాయనిర్ణేతలుగా మద్దుకూరి మధుభారతి, హైకోర్టు న్యాయవాది కొత్తా భవాని, కొత్తపల్లి రాజీవని వ్యవహరించారు. పోటీల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో మిమిక్రీ కళాకారుడు కాసుల కృష్ణంరాజు తన హాస్య చతురతతో ఆహుతుల్ని అలరించగా, మహిళలు, యువతులు, చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొని ఆటపాటలతో పోటీల్లో జోష్ నింపారు. పోటీలకు హాజరైన వారందరికీ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం కూడా అందజేయడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కందిమళ్ల రఘురామారావు, యడ్లపాడు మండల టీడీపీ అధ్యక్షుడు కామినేని సాయిబాబు, టీడీపీ నాయకులు భాష్యం ప్రసాద్, ఏటుకూరి రత్నకుమార్, ఎల్‌వీఆర్ క్లబ్ సంయుక్త కార్యదర్శి కొండ్రగుంట శ్రీనివాసరావు, టీ కేశవ్‌యాదవ్, యడ్లపాడు సొసైటీ అధ్యక్షుడు మద్దినేని సుబ్బారావు తదతరులు పాల్గొన్నారు. ఆంధ్రజ్యోతి డీజీఎం సూదా రామచంద్రరావు, బ్యూరో ఇన్‌చార్జి గింజుపల్లి భాస్కరరావు, యాడ్ మేనేజర్ ఎం సుబ్బారావు, సర్క్యులేషన్ మేనేజర్ విజయభాస్కరరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.


ముగ్గుల పోటీల కార్యక్రమంలో మాట్లాడుతున్న కుర్ర అప్పారావు, ఆంధ్రజ్యోతి డీజీఎం రామచంద్రరావు తదితరులు


ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన ముగ్గుల పోటీలో ఉత్సాహంగా పాల్గొన్న వృద్ధురాలు


పోటీల్లో పాల్గొన్న మహిళలు వేసిన ముగ్గులను పరిశీలిస్తున్న న్యాయనిర్ణేతలు

పోటీలు ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తాం
ప్రథమ బహుమతి విజేత విజయలక్ష్మి



ఈ మాసంలో 'ఆంధ్రజ్యోతి' నిర్వహించే ముగ్గుల పోటీల కోసం ప్రతి ఏటా ఎదురు చూస్తుంటాం. పోటీల్లో ప్రథమ బహుమతి విజేత విజయలక్ష్మి వెల్లడించారు. పల్లెపట్నం అనే తేడా లేకుండా ప్రస్తుతం సిమెంటు రోడ్లు వచ్చాయి. అయినా, మహిళలు ఎంతో ఉత్సాహంతో తమ ఇళ్ల ముందు ముగ్గులు వేస్తూనే ఉన్నారు, ఈ సంస్కృతిని మరింత ప్రోత్సహిస్తూ పోటీలు నిర్వహించడం అభినందనీయం.

ప్రోత్సహించడం అభినందనీయం
ద్వితీయ బహుమతి విజేత పూజిత




మహిళలను ప్రోత్సహించేలా ముగ్గులు పోటీలు నిర్వహించడం అభి నందనీయం. తాను ప్రతి ఏటా పోటీల్లో పాల్గొంటున్నాని, గత రెండు మూడేళ్లుగా రాష్ట్ర స్థాయిలో కూడా పాల్గొని బహుతులు సాధించాను. ఈ తరహా పోటీలు తెలుగు సంస్కృతీ సంప్ర దాయాలను కలకాలం కాపా డతాయి.

సంక్రాంతి.. ముందే వచ్చిందా
తృతీయ బహుమతి విజేత వీ చందన



సంకాంత్రి పండుగ ముందే వచ్చిందా అనే వాతావరణం నెలకొంది. పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సాంకేతిక పరిజ్ఞానం, సెల్‌ఫోన్ సంస్కృతి, సామాజిక మాధ్యమాలు కొత్తపుంతలు తొక్కుతున్నా, నేటి సమాజంలో తెలుగు సంస్కృతికి ప్రతీకగా ఈ పోటీలు నిలుస్తాయి. ఇటువంటి పోటీలతో మహిళల్లో స్ఫూర్తిని నింపవచ్చు.

కన్సొలేషన్ బహుమతి పొందిన ముగ్గులు











అలరించిన కూచిపూడి బృంద ప్రదర్శనలు


కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు

గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): సంస్కారభారతి ఆధ్వర్యంలో భరత మాత పూజా దినోత్సవ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పలు పాఠశాలలకు చెందిన విద్యార్థుల కూచిపూడి బృంద నృత్యాలు అలరించాయి. స్థానిక బృందావన్ గార్డెన్స్ లోని వెంకటేశ్వర స్వామి దేవాలయం ఆలయ ప్రాంగణంలోని శ్రీ పద్మావతి కళావేదికలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. కళాకృతుల తయారీ, రంగోలి పోటీలలో చిన్నారులు పాల్గొన్నారు. చిన్నారులు తయారు చేసిన కళాకృతులు ఆకట్టుకున్నాయి. తొలుత కార్యక్రమాలను ఆలయ పాలక మండలి ఉపాధ్యక్షుడు లంక విజయబాబు, సంస్థ నిర్వాహకుడు ఇండ్ల శ్రీధర్ బాబు ప్రారంభించారు. పోటీలలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్స్, ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్ బాబు

'ఏపీ గెట్ హెల్తీ' నినాదంతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

● ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ పోతినేని రమేష్‌బాబు వెల్లడి

గుంటూరు మెడికల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఏపీ గెట్ హెల్తీ' అనే నినాదంతో కోస్టల్ కారిడార్‌లో గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరులలో 925 పడకలతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రమేష్‌బాబు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే మూడవ అతిపెద్ద దిగ్గజ సంస్థలైన ఆస్టర్, డీఎం హెల్త్ కేర్, కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నిష్ణాతులైన వైద్యబృందంతో అత్యా.ధునిక వైద్య చికిత్సలను ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నట్లు తెలిపారు. టావి, మైట్రా క్లిప్ వంటి గుండె శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా ఇంటర్వెన్షనల్ విధానంలో చికిత్సలను ఏపీలో గుంటూరులో మొట్టమొదటిసారిగా చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 30 కిడ్నీ, కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేశామని, త్వరలో గుండె మార్పిడి, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. వైద్య రంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ పెంచడంలో భాగంగా అత్యాధునిక డ్రోన్ సేవలను తమ ఆసుపత్రిలో త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. 'క్లౌడ్ డాక్స్ రమేష్' అనే టెలి ఐసీయూ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ సహకారంతో మారుమూల గిరిజనప్రాంతాలైన రంపచోడవరం, పాడేరులో అత్యవసర వైద్యసేవలు త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. 5జీ అంబులెన్స్‌ల ద్వారా రోగి తర లింపు సమయంలో రియల్ టైమ్ మానిటరింగ్ అందుబాటులోకి తెచ్చామని, దీని వల్ల రోగి తరలింపు సమయంలో మరణాల రేటు గణనీయంగా తగ్గించగలమని రమేష్‌బాబు తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యసేవకే పరిమితం కాకుండా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గుర్తింపుతో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులకు వైద్య విద్యను అందించే అతి పెద్ద అకడమిక్ ఇనిస్టిట్యూట్‌గా ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందినట్లు తెలిపారు. హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు తదితర 25 ఔట్ రీచ్ సెంటర్లలో ప్రతి మంగళవారం ఉచిత కన్సల్టేషన్, రాయితీలతో వైద్యపరీక్షలు అందించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగదు


మాట్లాడుతున్న టీడీపీ నాయకుడు కన్నసాల బాజీ, పేరయ్య తదితరులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): నీతి నిజాయితీతో పనిచేస్తున్న జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులుపై అనుచిత వ్యాఖ్యలను పశ్చిమ నియోజకవర్గ టీడీపీ నాయకులు ఖండించారు. టీడీపీ నాయకులు ఆదివారం స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కౌన్సిల్ సమావేశం సంద ర్భంగా అనుచితవ్యాఖ్యలు చేసిన డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, దానిని సమర్థించిన మేయర్ కావటి మనోహర్ నాయుడు తక్షణమే కమిషనర్‌కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ రౌడీ రాజకీయాలు ఇకనైనా మానుకోవాలని, లేకపోతే ప్రజలే బుద్ధిచెబుతారని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ అధికార ప్రతినిధి ఉప్పుటూరి పేరయ్య, కొరిటపాడు వాకింగ్ ట్రాక్ ప్రెసిడెంట్, 44వ డివిజన్ క్లస్టర్ ఇన్‌చార్జి కన్నసాని బాజి, వాణిజ్య విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి పొదిలా వాసు, 22వ డివిజన్ అధ్యక్షుడు షేక్ నాగుర్, నగర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కొల్లి అనిల్, 45వ డివిజన్ మాజీ ప్రెసిడెంట్ బెజవాడ శివరామకృష్ణ రెడ్డి,30వ డివిజన్ అధ్యక్షుడు కురంగి శ్రీను పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్ క్షమాపణ చెప్పాలి: ఏఐటీయూసీ, జనసేన

గుంటూరు కార్పొరేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కమిషనర్ పులి శ్రీనివాసులుపై డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు చేసిన వ్యాఖ్యలను ఏఐటీ యూసీ, జనసేన నాయ కులు ఖండించారు. తక్ష ణమే కమిషనర్‌కు క్షమా పణ చెప్పాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సంద ర్భంగా ఆదివారం ఏఐటీ యూసీ, జనసేన నాయకులు బండెల రవికుమార్, ఆళ్ల హరి మాట్లాడారు. ఇలాంటి వ్యాఖ్యలు కౌన్సిల్ సమావేశంలో గానీ, ఇతర సందర్భాల్లో గానీ పునరావృతం కాకుండా మేయర్ బాధ్యత వహించాలని అన్నారు.

చార్లెస్ శోభరాజ్‌కు దీటుగా జగన్: కనపర్తి శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): వ్యవస్థలలోని లోపాలను అడ్డుపెట్టుకుని నేరాలకు పాల్పడడం, వాటినే అడ్డుపెట్టుకొని బయట పడడంలో అంతర్జాతీయ నేరస్తుడు చార్లెస్ శోభరాజ్‌కు వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి ఏమాత్రం తీసిపోడని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కనపర్తి శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులను బెదిరించి, బ్లాక్ మెయిల్ చేసి పబ్బం గడుపుకోవడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య అని ఆయన విమర్శించారు. జగన్‌రెడ్డి ఇకనైనా అసత్యాలు మాని అసెంబ్లీకి వెళ్లాలని హితవు పలికారు. కార్యక్రమంలో బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు వేములకొండ శ్రీనివాస్, ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి సుశీలరావు పాల్గొన్నారు.

'తల్లికి వందనం'తక్షణమే అమల్లోకి తీసుకురావాలి

● ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ

గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలో భాగంగా ఇచ్చిన 'తల్లికి వందనం' పథకాన్ని ఈ విద్యాసంవత్సరం నుంచే అమల్లోకి తీసుకురావాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్ జీ డిమాండ్ చేశారు. స్థానిక కొత్తపేట భగత్‌సింగ్ విగ్రహం వద్ద ఆదివారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో 'తల్లికి వందనం' ఇస్తామని నారా లోకేశ్ నాడు ఇచ్చిన హామీని గుర్తుచేశారు. ఇప్పుడు వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ పథకాన్ని అమలు చేస్తామని క్యాబినెట్ సమావేశంలో లోకేశ్ చెప్పడం సబబు కాదని అన్నారు. ఈ నిర్ణయాన్ని పునరాలోచించాలన్నారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

● జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు

గుంటూరు కార్పొరేషన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థ పరిధిలో అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, పనులు జరిగే సమయంలో దశల వారీగా క్వాలిటీ కంట్రోల్ సిబ్బంది, ఎమినిటి కార్యదర్శులు పర్య వేక్షణ చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. లాంచెస్టర్ రోడ్డులోని సాయి కృష్ణనగర్, ఆనందపేట, బీఆర్ స్టేడియం రిజర్వాయర్ ప్రాంతాల్లో ఆదివారంనాడు కమిషనర్ పర్యటించారు. అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇప్పటికే వార్డ్ సచి వాలయాల వారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశామని, ప్రాధాన్యత క్రమంలో చేపడతామన్నారు. అలాగే నగరంలో మెరుగైన పారిశుధ్య పనులు జరిగేందుకు డివిజన్ల పునర్విభజన చేశామని, పనులకు అవసరమైన వాహనాలు, పుష్ కాట్స్, బిన్లు అందించినందున, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు క్రమ పద్ధతిలో పనులు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యటనలో ఏఈ రవి కిరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి రాజేష్ పాల్గొన్నారు.


నాణ్యతా ప్రమాణాలను పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు


గంజాయ్ బ్యాచ్ ఆగడాల గురించి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మాధవి

గంజాయి బ్యాచ్‌ను ఉపేక్షించం: ఎమ్మెల్యే మాధవి

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గంజాయి బ్యాచ్‌ను ఉపేక్షించే ప్రసక్తే లేదని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. స్థానిక శ్రీనివాసరావుతోటలో కొంతమంది యువకులు గంజాయి, హెరాయిన్ తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, ఆదివారం ఆ ప్రాంతంలో పర్యటించారు. అక్కడి పరిస్థితులను పరిశీలించారు. నగరంలోని అరవై అడుగుల రోడ్డు, వాటర్ ట్యాంకు పరిసరా ల్లోని స్థానికులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి అవుతుంటే భయం వేస్తోందని, ఎప్పుడేం జరుగుతుందోనన్న భయంతో ఆందోళనకు గురవుతున్నామని మహిళలు ఎమ్మెల్యే వద్ద వాపోయారు. వాటర్ ట్యాంక్ ప్రహరి గోడ ఎత్తు తక్కువగా ఉండటంతో, గోడ దూకి లోపలికి వచ్చి తమని ఇబ్బంది పెడు తున్నారని, అక్కడ విధులు నిర్వహిస్తున్న వారు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర యువతదేనని, సమాజంలో మార్పు తీసుకొచ్చే శక్తి యువతకు మాత్రమే ఉందని అన్నారు. అటువంటి యువత మాదక ద్రవ్యాల బారినపడి నిర్వీర్యం అయిపోతున్నారని, పిల్లల నడవడి కపై దృష్టి పెట్టి వారిని గంజాయి మహమ్మారి నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందని అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి, మాదక ద్రవ్యాల సరఫరాపై ఉక్కుపాదం మోపిందన్నారు. గంజాయి వినియోగం గతంలో కన్నా తగ్గిందని, క్షేత్రస్థాయిలో అరికట్టేందు పోలీసులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రధానంగా విద్యార్థులు, యువకులు చెడు అలవాట్లకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లితండ్రులపై ఉందన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ గంజాయి బ్యాచ్‌ని సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆళ్లహరి, షేక్ నాగుర్ వలి, షర్ఫుద్దీన్,రామారావు,అప్పిసెట్టి రంగా, చింతకాయల సాయి, ఖర్జూర శ్రీను, సుభాని పాల్గొన్నారు.

డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మూడు విద్యుత్ పంపిణీ సం స్థలైన ఏపీ ఎస్పీడీసీఎల్, సీపీడీసీఎల్, ఈపీడీసీఎల్‌తో పాటు ఏపీ ట్రాన్స్‌కో, జెన్‌కోల లోని డిప్లొమా ఇంజనీర్స్‌తో రాష్ట్ర నూతన కార్యవర్గం (2025-26) ఎన్నిక ఆదివారం గుంటూరులో జరిగింది. ఏపీ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ అడ్వైజర్‌గా ఎ సుబ్బా రావు, ప్రెసిడెంట్‌గా కేవీ శేషారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పీ హుస్సేన్‌ఖాన్, సెక్రటరీ జనరల్ పి సన్యాసిరావు, వైస్ ప్రెసిడెంట్ ఆర్ సాంబశివరావు, వైస్ ప్రెసిడెంట్ (జెన్కో) పీ నరేంద్ర, డిప్యూటీ జనరల్ సెక్రటరీ జనరల్‌లు వీ శ్రీనివాసరావు, టీకే మిశ్రాలతో పాటు జాయింట్ సెక్రటరీలు, ఆర్గనైజింగ్ సెక్రటరీలతో కలిపి నూతన కార్యవర్గం ఎన్నికైనట్లు తెలిపారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి ప్రచారం


చుట్టుగుంట వాకింగ్ ట్రాక్‌లో వాకర్స్‌తో కరచాలనం చేస్తున్న ఆలపాటి రాజా

గుంటూరు(విద్య),జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఆదివారం చుట్టుగుంట వాకింగ్ ట్రాక్‌లో ప్రచారం నిర్వహించారు. రానున్న పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఆయన వాకర్స్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభు త్వం పని చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్సీగా తనను గెలిపిస్తే అభివృద్ధిలో తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. చుట్టుగుంట వాకింగ్ ట్రాక్ సమస్యలు పరిష్కరిస్తానని తెలిపారు.

దేశ ఆర్థికాభివృద్ధిలో బ్యాంకు ఉద్యోగుల పాత్ర కీలకం

గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): ఏడున్నర దశాబ్దాల దేశ ఆర్థికాభివృద్ధిలో రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకత్వంలో పనిచేస్తున్న బ్యాంకుల విశ్రాంత అధికారులు, ఉద్యోగుల పాత్ర గణనీయమైనదని యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి ఎస్. జవహర్ అన్నారు. స్థానిక బ్రాడీపేట పెన్షనర్స్ హోమ్ సమావేశ మందిరంలో ఆదివారం ది గుంటూరు డిస్ట్రిక్ట్ బ్యాంక్ రిటైరీస్ కోఆర్డినేషన్ కమిటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ విరమణ అనంతరం వారు ఎదుర్కొంటున్న సమస్యలు ఐక్యంగా పరిష్కరించుకోవాలన్నారు. విశిష్ట అతిథులు ఆల్ ఇండియా బ్యాంక్ రిటైర్డ్ ఫెడరేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి వారణాసి కృష్ణమూర్తి, ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రిటైరీస్ ఫెడ రేషన్ ప్రధాన కార్యదర్శి ఏ యల్లారావు మాట్లాడారు. జాతీయ స్థాయిలో అన్ని బ్యాంకుల అధికారుల ఉద్యోగుల సంఘాల పోరాటాలతోనే లక్ష 97 వేల మందికి ఫ్యామిలీ పెన్షన్ సాధించుకో గలిగామన్నారు. సమావేశంలో జిల్లా కోఆర్డినేషన్ కమిటీ అధ్యక్షుడు కే హరిబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

● రామిరెడ్డితోట, ప్రకాష్ నగర్‌లలో మహిళలకు పోలీస్ కౌన్సెలింగ్

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక రామిరెడ్డితోట, ప్రకాష్ నగర్ తదితర ప్రాంతాల్లో వ్యభి చారం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈస్ట్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, కొత్తపేట సీఐ వీరయ్య చౌదరి హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం డీఎస్పీ, సీఐలు కొత్తపేట పరిధిలోని రామిరెడ్డితోట రైల్వే ట్రాక్ రోడ్డులోనూ, అదేవిధంగా ప్రకాష్ నగర్ లోనూ వ్యభిచార కార్యకలాపాలు జరిగే గృహ నిర్వాహకులకు, స్థానిక మహిళలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఇటీవల కాలంలో ఈ ప్రాంతంలో వ్యభిచార కార్యకలాపాలు జరుగుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వారిని తీవ్రస్థాయిలో హెచ్చరించారు. తాము ఆకస్మికంగా దాడులు నిర్వహించిన సమయంలో ఎవరైనా పట్టుబడితే వారిపై చట్ట ప్రకా రం కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ ప్రాంతంపై ప్రత్యేకంగా ఉంచామని, ఎవరైనా గుట్టుగా కార్యకలాపాలు సాగించాలనుకుంటే చర్యలు తప్పవని అన్నారు. వ్యభిచారం లాంటి వృత్తిని మానుకొని కష్టపడి పనిచేసి జీవనం సాగించాలన్నారు. హెచ్ఐవి లాంటి ప్రాణాంతక రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుందన్నారు. స్థానికులకు ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వచ్చి తమ దృష్టికి తీసు కొస్తే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బయట వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్ప వన్నారు. ప్రభుత్వ నిర్వహించే స్వయం ఉపాధి పథకాలు ద్వారా లబ్ధి పొంది జీవనం సాగించాలని సూచించారు.

గంజాయి మత్తులో ఆటో డ్రైవర్ల దోపిడి

● పోలీసుల అదుపులో నిందితుడు

గుంటూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నగరంపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి మత్తులో ఇరువురు ఆటో డ్రైవర్లు దోపిడీకి పాల్పడ్డారు. మెడిసిన్ విద్యార్థిని బెదిరించి డబ్బు గుంజుకున్నారు. వివరాలలోకి వెళితే... పట్టాభిపురం ప్రాంతానికి చెందిన మెడికల్ విద్యార్థి తేజ అర్ధరాత్రి సమయంలో ఇంట్లో తల్లిదండ్రులు గొడవ పడుతుండడంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి బయటకు వచ్చారు. నడుచు కుంటూ వస్తుండగా మెడికల్ కళాశాల రోడ్డులో గంజాయి మత్తులో ఉన్న ఆటో డ్రైవర్లు, తేజను ఆటో ఎక్కించుకున్నారు. మెడికల్ కళాశాల దాటిన తర్వాత రైల్వే ట్రాక్ పక్కన ఉన్న పాడుబడ్డ రైల్వే క్వార్టర్స్ వద్దకు తీసుకువెళ్లి చంపుతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. తనవద్ద డబ్బు లేదని చెప్పడంతో ఫోన్ పే ద్వారా ఐదు వేలు తమ తమ ఖాతాకు బదిలీ చేయించుకున్నారు.

దీనిపై బాధితుడు తేజ నగరంపాలెం పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోన్ పే నెంబర్ ఆధారంగా నిందితుల్లో ఒకరిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది. మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు.



ఇంటి యజమాని మద్యానికి బానిసైతే ఆ కుటుంబం అనుభవించే బాధ వర్ణనాతీతం.. అలాంటి నరకాన్ని ఎన్నో ఏళ్ళు అనుభవించారు చెన్నైకి చెందిన **భాను సురేష్‌బాబు.** కష్టనష్టాలు భరించి, ఓర్పుతో, నేర్పుతో తన భర్తను మార్చుకున్నారు. తన దుస్థితి మరే మహిళా అనుభవించకూడదనే ఆలోచనతో... డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేసి... వందలాదిమందికి కొత్త జీవితాన్ని ప్రసాదిస్తున్నారు. స్ఫూర్తిమంతమైన భాను జీవన ప్రయాణం గురించి ఆమె మాటల్లోనే...

మత్తు వదిలిస్తున్నారు

"మా వారు స్టేట్ బ్యాంక్‌లో ఉద్యోగం చేసేవారు. చీఫ్ మేనేజర్‌గా రిటైరయ్యారు. అయితే మా పెళ్లయిన కొత్తలో ఆయన రేయింబవళ్లు తాగేవారు. ఆయనవల్ల నాతో పాటు మొత్తం మా ఉమ్మడి కుటుంబంలోని 20 మంది సమస్యలు ఎదుర్కోవాల్సివచ్చింది. సరిగ్గా ఆఫీసుకు వెళ్లేవారు కాదు. దాంతో ఉద్యోగం నుంచి తీసేస్తామని ఉన్నతాధికారులు హెచ్చరించారు. నేను వారిని కాళ్లా వేళ్లా పడి బతిమాలితే వదిలేశారు. అలా 1985-94 మధ్య నరకం అనుభవించాను. ఆయనను ఎలాగైనా బాగు చేసుకుందామని ప్రయత్నాలు మొదలుపెట్టాను. ఎన్నో ఆలయాలకు వెళ్లాను. వ్రతాలు చేశాను. కొంతమంది మాటలతో మతం మార్చుకొనేందుకూ సిద్ధమయ్యాను. అవేవీ ఫలించలేదు.

జీవితం మీద విరక్తి కలిగేది...

చివరకు తిరువాన్మియూరు టీటీకే హాస్పిటల్లో ఒక డి-అడిక్షన్ చికిత్సా కేంద్రం ఉందని తెలిసి, మావారిని చేర్పించాను.. అక్కడ మద్యం బానిసలతో పాటు వారి కుటుంబీకుల్లో ఒకరు తోడు ఉండాలి. దాంతో మావారి వెంట నేనే వున్నాను. అప్పట్లో చెన్నై మొత్తం మీద అలాంటి కేంద్రం అదొక్కటే ఉండేది. ట్రీట్‌మెంట్ తరువాత ఒక నెల బావుండేవారు. తరువాత మళ్లీ పాత పద్ధతే. దాంతో నాకు జీవితం మీద విరక్తి కలిగేది. ఆ కేంద్రంలో చికిత్స పొందుతున్నవారి కుటుంబ సభ్యులకు కూడా సైకో థెరపీ, కౌన్సెలింగ్ ఇచ్చేవారు. దాంతో నాకు కూడా మద్యపాన సమస్య మీద ఎంతో అవగాహన వచ్చింది. చివరికి... సుమారు పదేళ్ల తరువాత మావారిలో మార్పు వచ్చింది. పూర్తిగా మద్యం మానేశారు. అప్పుడు నేను ఆలోచనలో పడ్డాను. ఒక వ్యక్తి చేత మద్యం మానిపించడానికి నేను ఇంత కష్టపడ్డాను. ఇదే సమస్య ఎదుర్కొంటున్న మిగిలిన మహిళల సంగతేమిటి? అందరూ ఇంతగా పోరాడాల్సిందేనా? ఒక వ్యక్తి మద్యపానంలో కూరుకుపోతే, ఆ కుటుంబం మొత్తం నష్టపోవాలా? దేవుడు నాకు చూపించిన మంచిని నలుగురికి పంచాలనుకున్నాను. అదే కేంద్రానికి వెళ్లి బాధితులకు స్వచ్ఛందంగా కౌన్సెలింగ్ ఇవ్వడం ప్రారంభించాను. అవగాహన కల్పించాను. ఆ సెంటర్లో ఒక పెద్దాయన దీనికి సంబంధించి కోర్సు చేస్తే అధికారికంగా కౌన్సెలింగ్ ఇవ్వవచ్చని సూచించారు. అప్పటికే నేను బీఏ హిస్టరీ చేశాను. అప్పటికి నా వయసు 33 ఏళ్లు.. ఎంఏలో చేరే అవకాశం ఉన్నా... కావాలనే బీఏ సైకాలజీలో చేరాను. తరువాత ఎంఏ సైకాలజీ, ఎంఫిల్ చేశాను. డి-అడిక్షన్ సెంటర్‌లో పని చేయడానికి అవసరమైన శిక్షణ పొందాను. అనేక కోర్సులు చేశాను. ఆ తరువాత టీటీకే సెంటర్ వారు ఫ్యామిలీ థెరపిస్ట్, రిహాబిలిటేషన్ కౌన్సెలర్‌గా అవకాశం ఇచ్చారు. అక్కడ ఏడేళ్ల పాటు పని చేశాను. ఆ తరువాత చెన్నై కార్పొరేషన్‌కు చెందిన 'కెపాక్స్' అనే కేంద్రంలో చేరాను. అక్కడి నుంచి 15 సంవత్సరాల పాటు వివిధ కేంద్రాల్లో పని చేశాను.

పరిమితులు లేని సేవకోసం...

డి-అడిక్షన్, మద్యపానం, మాదకద్రవ్యాల వ్యసనం తదితర అంశాలపై పని చేశాను. అక్కడ నాకు పరిమితులు ఉండేవి. వాటిని అధిగమించి సేవ చేయడానికి సొంతంగా ఒక స్వచ్ఛంద సంస్థను, దానికి అనుబంధంగా డి-అడిక్షన్ సెంటర్ ఏర్పాటు చేయాలని దృఢంగా అనుకున్నాను. ఆ కేంద్ర భవనంలో వార్డులు, ఓపెన్ ఏరియా, థెరపీ సెంటర్, కిచెన్, థియేటర్ హాల్ లాంటివన్నీ ఉండేలా ప్రణాళిక వేసుకున్నాను. దాని గురించి మా వారికి చెబితే "ఇవన్నీ కావాలంటే కొన్ని కోట్లు కావాలి. మనకంత శక్తి ఎక్కడిది?" అన్నారు.. దాంతో మా ఆర్థిక స్థోమత మేరకు పరిమితంగానే పని ప్రారంభించాను. 2005లో 'కన్సర్న్' అనే సంస్థను ఏర్పాటు చేశాను. అనంతరం డబుల్-బెడ్‌రూమ్ ఇంటిని అద్దెకు తీసుకొని, అయిదు పడకలతో డి-అడిక్షన్ సెంటర్‌ని ప్రారంభించాం. ఇప్పుడు మాడంబాక్కంలో ఇది నడుస్తోంది. ఈ కేంద్రానికి వచ్చిన వారికి అన్నీ బోధపడేలా చెప్పి, వ్యసనం మాన్పించడానికి ప్రయత్నిస్తాం. ఇప్పుడు సామాజిక న్యాయ మంత్రిత్వశాఖతో కలిసి పని చేస్తున్నాం. మా 'కన్సర్న్'లో ఆహారం, చికిత్స, కౌన్సిలింగ్, మందులు తదితరాలన్నీ ఉచితమే. ఇప్పటి వరకూ 2 వేల మందికి చికిత్స అందించాం.

> 'మా స్వస్థలం చెన్నై. మా అత్తగారి పూర్వీకులు ఆంధ్రా సరిహద్దు నుంచి వచ్చి చెన్నైలోనే స్థిరపడ్డారు. మేం తెలుగునాయుళ్లం. ఇంట్లో తెలుగే మాట్లాడతాం. మా పిల్లలు, మనవళ్లు అందరూ ఇంట్లో తెలుగు మాట్లాడాల్సిందే. నో డాడీ.. నో మమ్మీ... 'అమ్మా-నాన్నా' అని పిలవాల్సిందే. మన అమ్మ భాషను మరచిపోతే అమ్మను కూడా మరచిపోయినట్లే.
> అందుకే ఒక్కొక్కరికి నాలుగైదు భాషలు వచ్చినా అందరం మాట్లాడేది తెలుగులోనే."

మమ్మల్ని సంప్రదించాలంటే...

"మా వెబ్‌సైట్ ద్వారా, 'కన్సర్న్' హెల్ప్‌లైన్: 044-46865176 ద్వారా మమ్మల్ని సంప్రదించవచ్చు. మా సంస్థ గురించి అందరికీ తెలుసు. తమిళనాట ఎవరైనా డి-అడిక్షన్ కేంద్రం పెట్టాలంటే ముందుగా మమ్మల్నే సంప్రదిస్తారు. బాధితుడికి చికిత్స పూర్తయిన తరువాత కొన్ని కుటుంబాలు వారిని తీసుకువెళ్లడానికి ఇష్టపడవు. అలాంటివారికి మేమే నెల రోజుల పాటు బస కల్పిస్తాం. ఆ నెల రోజుల్లో వారు ఏదో ఒక ఉపాధి వెతుక్కోవాల్సి ఉంటుంది."

కుటుంబ మద్దతు అవసరం


మద్యపాన బానిసలకు కుటుంబ సభ్యుల మద్దతు ఎంతో అవసరం. చాలామంది "ఏం చేసినా ఆయన మారరు" అంటూ ఉంటారు. అది తప్పు. అలా అనుకుంటే మా వారు మారేవారా? ఇంతమంది జీవితాలను మేం ప్రభావితం చేయగలిగేవారమా?. కాబట్టి నిరంతరం ప్రయత్నం చేయాల్సిందే. మద్యానికి అలవాటుపడిన వారిని అలాగే వదిలేయకండి. మానసికంగా వారికి దగ్గరవ్వండి, వారి బాగోగులు చూసుకునేందుకు మీరున్నారన్న నమ్మకం కలిగించండి. వారిని ఇలాంటి రిహాబిలిటేషన్ సెంటర్లకు తీసుకువచ్చి చికిత్స చేయించండి. చికిత్స పొందిన తరువాత కూడా ఏడాదిపాటు కుటుంబ సభ్యులు వారిని గమనిస్తూ, అదుపులో ఉంచాలి. ఏడాదిపాటు మద్యం జోలికి పోలేదంటే, ఇక జీవితంలో అటు వైపు వెళ్లరు.

ఆ సంతృప్తి మాటల్లో చెప్పలేను...

మాకు ఒకే అబ్బాయి. అతను ఆర్కిటెక్ట్. జీవితంలో స్థిరపడ్డాడు. మాకు ఎలాంటి బరువు బాధ్యతలు లేవు. అందుకే నాలాంటి బాధితుల్ని గట్టెక్కించాలన్న ఉద్దేశంతో ఈ సేవను ఎంచుకున్నాను. మా వారు రిటైరయ్యాక ఆయన కూడా నాకు పూర్తిగా సహకరిస్తున్నారు. ఆయన మద్యపానానికి వ్యతిరేకంగా అవగాహనా కార్యక్రమాలు చేపడుతున్నారు. మా దగ్గర చికిత్స పొందిన వారి కుటుంబ సభ్యులు సంతోషంగా మా దగ్గరకు వచ్చినప్పుడు మాకు కలిగే సంతృప్తిని మాటల్లో చెప్పలేను."

● **డాక్టర్ ఎస్‌కేఎండీ గౌస్‌బాషా,** చెన్నై
ఫొటోలు: కర్రి శ్రీనివాస్

ముత్యాల ముగ్గు



17 చుక్కలు, 17 వరుసలు



జి. సుహాసిని, మచిలీపట్నం

ఈ-మెయిల్: features@andhrajyothy.com

పంచదారకు బదులుగా...

చలికాలంలో తరచుగా వచ్చే ప్రత్యేక సందర్భాల కోసం తీపి పదార్థాలు వండుతుంటాం. వీటిలో చాలావరకూ పంచదారనే ఉపయోగిస్తాం. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. పంచదారకు బదులు ఏమి వాడవచ్చో తెలుసుకుందాం!

తేనె



● ఇది సహజంగా లభించే తీపి పదార్థం. దీనిని సంప్రదాయ తీపి వంటకాలతోపాటు కేక్‌లు, కుకీలు, పేస్ట్రీల తయారీలో వాడవచ్చు. తేనెలోని విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కలిసి శరీరానికి తక్షణ శక్తిని అందిస్తాయి. ముడి తేనె వాడుకోవడం మంచిది.

బెల్లం



● దీనిని చెరకు లేదా తాటి రసంతో తయారు చేస్తారు. రెండూ ఆరోగ్యానికి మంచివే. వీటిలో ఐరన్ అధికంగా ఉంటుంది. నువ్వుల లడ్డూలు, క్యారెట్ లేదా గాజర్ హల్వా, పుడ్డింగ్‌ల తయారీలో బెల్లాన్ని వాడడం మంచిది.

ఖర్జూరాలు



● కేక్, కుకీల తయారీలో ఖర్జూరం సిరప్... ఖీర్, పాయసం, హల్వా, డ్రైఫ్రూట్ లడ్డూల తయారీలో ఖర్జూరం పేస్ట్... వాడుకోవచ్చు. ఖర్జూరంలో ఉండే పొటాషియం రక్తంలో చక్కెర స్థాయి పెరగకుండా నిరోధిస్తుంది.

ఇలపై ఇంద్రధనస్సు







తెనాలిలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత లక్ష్మీతిరుపతమ్మకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు



నరసరావుపేటలో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు



గుంటూరులో ద్వితీయ బహుమతి పొందిన ముగ్గు, ఇన్‌సెట్‌లో విజేత పూజిత



గుంటూరులో రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు



నరసరావుపేటకు చెందిన ఏ నాగజ్యోతికి ద్వితీయ బహుమతిని అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ





నరసరావుపేటలో తృతీయ బహుమతి సాధించిన ముగ్గు

ఇంద్ర ధనస్సులోని వర్ణాలను ఇలపైకి దించారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు తెలుగు సంస్కృతిని, సంప్రదాయాల్ని ప్రతిబింబిస్తూ ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలో ముగ్గులను తీర్చిదిద్దారు. గుంటూరు, తెనాలి, నరసరావుపేట కేంద్రాల్లో జరిగిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. సప్తవర్ణాలతో మహిళలు వేసిన ముగ్గులు చూపరులను విశేషంగా ఆకట్టుకున్నాయి.



గుంటూరులో తృతీయ బహుమతి పొందిన ముగ్గు, విజేత చందనకు బహుమతి అందజేస్తున్న టీడీపీ సీనియర్ నాయకుడు కుర్రా అప్పారావు తదితరులు





తెనాలిలో మూడవ బహుమతి పొందిన ముగ్గు, విజేత పి.సాయిచైతన్యకు బహుమతి అందజేస్తున్న రాజకుమారి, మురళి, నాగభూషణం తదితరులు



నరసరావుపేటలో తృతీయ బహుమతిని పాపన సుజాతకి అందజేస్తున్న నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ

పశ్చిమడెల్టాకాల్వకు 1416 క్యూసెక్కుల నీరు

దుగ్గిరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి పశ్చిమ డెల్టా కాల్వకు 1516 క్యూసెక్కుల సాగునీటిని ఆదివారం విడుదల చేసినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. బ్యారేజివద్ద 12.0 అడుగుల నీటిమట్టం ఉండగా, దుగ్గిరాల సబ్‌డివిజన్ నుంచి రేపల్లె కాల్వకు 148 క్యూసెక్కుల నీరు, తూర్పుకాల్వకు 200 క్యూసెక్కులు, పశ్చిమ కాల్వకు 100 క్యూసె క్కులు, నిజాంపట్నంకాల్వకు 50 క్యూసెక్కులు, కొమ్మమూరుకాల్వకు 975 క్యూసెక్కుల నీరు, విడుదల చేస్తున్నారు.

చౌక డిపో బియ్యం పట్టివేత



రాఘవేంద్ర రైస్ మిల్లులో పట్టుబడిన బియ్యం బస్తాలతో తహసీల్దార్ ప్రసాదరావు

ఫిరంగిపురం, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఫిరంగిపురం గ్రామంలోని రాఘవేంద్ర రైస్ మిల్లులో ఆదివారం తహసీల్దార్ జే ప్రసాదరావు రెవెన్యూ అధికారులతో కలసి తనిఖీ చేయగా మొత్తం నాలుగు బంకర్లు ఉండగా ఒక బంకరులోని చౌక డిపో బియ్యాన్ని గుర్తించామని, వీటి బరువును అంచనా వేస్తున్నామని, నిర్వహణ దారులపై 6(ఏ) కేసు నమోదు చేయటానికి పంచనామా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్ర మంలో రెవెన్యూ అధికారులు, వీఆర్వోలు, వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ఉండవల్లిలో వైద్యశిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

తాడేపల్లి, జనవరి 5(ఆంధ్రజ్యోతి): తాడేపల్లి మండలం ఉండవల్లిలో పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్, లుపిన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ క్యాంపును పల్లెటూరు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్నా రాజేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఉండవల్లి గ్రామస్థుల కోసం వైద్యశిబిరం ఏర్పాటు చేశారని చెప్పారు. ఈ క్యాంపులో కేవలం పది రూపాయలకు టెస్టులు నిర్వహించారన్నారు. సుమారు 100 మంది వైద్యపరీక్షలు చేయించుకున్నారని ఇక నుంచి నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని రాజేష్ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణలో గందరగోళం

● ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్

పెదనందిపాడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన కులగణనలో ఎస్సీ వర్గీకరణ గందరగోళంగా ఉందని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్ టీ ఏసుపాదం అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో కులగణన సర్వేను వలంటీర్లు ఇష్టానుసారంగా నమోదు చేశారన్నారు. ఇప్పుడు అదే వలంటీర్లను ప్రశ్నిస్తే సర్వే చేయలేదని తమకు తెలుసని వివరాల ప్రకారం ట్యాబ్‌లో నమోదు చేశామని తెలిపారని, చేసిన సర్వేను సైతం వైసీపీ ప్రభుత్వం ప్రచురించలేదని, ఆ కులగణననే ప్రచురించడం వల్ల మాదిగలకు తీవ్ర అన్యాయం కలుగుతుందని తెలిపారు. దీనిపై కూటమి ప్రభుత్వం స్పందించి సర్వేలోని ఎస్సీ కులాల డేటాలను తీసుకొని పరిశీలించి దాని ప్రకారం నమోదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు పాపారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి 52 ప్రత్యేక రైళ్లు

● నేటి నుంచి 18వ తేదీ వరకు అందుబాటులో..

హైదరాబాద్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా పలు ప్రాంతాలకు వెళ్లి వచ్చే ప్రయాణికుల కోసం 52 ప్రత్యేక రైళ్లను నడిపేందుకు ఏర్పాట్లు చేసినట్టు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జనవరి 6 నుంచి 18 వరకు ఈ రైళ్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. జనవరి 6, 7 తేదీల్లో చర్లపల్లి - తిరుపతి - చర్లపల్లి (07077/07078), 8, 9, 11, 12, 15, 16 తేదీల్లో చర్లపల్లి - తిరుపతి - చర్లపల్లి (02764/02763) మధ్య 6 రైళ్లు అందుబాటులో ఉంటాయి. 13న వికారాబాద్ - కాకినాడ టౌన్ (07037), 14న కాకినాడ టౌన్ - చర్లపల్లి (07038) మధ్య రైళ్లు నడుస్తాయి. 9, 10, 16, 17 తేదీల్లో కాచిగూడ - తిరుపతి - కాచిగూడ మధ్య నాలుగు, 11, 12, 18, 19 తేదీల్లో చర్లపల్లి - నర్సాపూర్ - చర్లపల్లి (07035/07036) మధ్య నాలుగు, 12, 19 తేదీల్లో సికింద్రాబాద్ - కాకినాడ టౌన్-సికింద్రాబాద్ మధ్య నాలుగు, జనవరి 7, 8, 9, 10, 13, 14, 15, 16, 17, 18 తేదీల్లో చర్లపల్లి - నర్సాపూర్ - చర్లపల్లి (07033/ 07034)మధ్య పది రైళ్లు నడుస్తాయి. 8, 9, 10, 11, 12, 13, 14, 15 చర్లపల్లి- కాకినాడ టౌన్- చర్లపల్లి (07031/07032) మధ్య ఎనిమిది, జనవరి 6, 7, 13, 14 తేదీల్లో నాందేడ్ - కాకినాడ టౌన్ - నాందేడ్ (07487/07488) మధ్య నాలుగు, జనవరి 9, 10, 12, 13, 14, 15 తేదీల్లో చర్లపల్లి- శ్రీకాకుళం రోడ్ - చర్లపల్లి (07025/07026) మధ్య ఆరు రైళ్లు అందుబాటులో ఉంటాయి. 7, 8 తేదీల్లో కాచిగూడ-శ్రీకాకుళం రోడ్- కాచిగూడ (07041/07042)మధ్య రెండు రైళ్లు నడపనున్నట్లు అధికారులు తెలిపారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కేరింత

మంగళగిరి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం పెదవడ్లపూడి గ్రామంలోని తోటల్లో కేరింత పేరిట ఆటల పోటీలు నిర్వహించారు. మంగళగిరి, తాడేపల్లి, తెనాలి, గుంటూరు రోటరీ క్లబ్‌లకు చెందిన కుటుంబాలు హాజరయ్యాయి. వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడేనా..?

● పేదలమంటూ ప్రభుత్వ స్థలాల్లో పాగా
● అక్కదేవత చెరువుల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు
● నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్న రెవెన్యూ అధికారులు



బడేపురం శివారులో డొంక పొరంబోకు స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లు, గుడిసెలు

తాడికొండ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్టపడేనా అనేది ప్రశ్నార్థకంగా మారింది. ప్రభుత్వ భూములు, చెరువులు భూములు అని లేకుండా అక్రమార్కులు ఇష్టానుసారంగా భూములను కబ్జాలు చేసి యథేచ్ఛ గా నిర్మాణాలు చేస్తున్నారు. అధికారులు పట్టీపట్టన ట్లు వ్యవహరిస్తు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములు ఖాళీగా కన్పిస్తే ఆక్రమించుకొని నిర్మాణాలు చేయటం పరిపాటిగా మారింది. వైసీపీ నాయకులకు ముడుపులు చెల్లించి ప్రభుత్వ భూములు కబ్జాలు చేశారు. తాడికొండ శివారు బడేపురం, తాడికొండ, లాం గ్రామాల్లో కొండ పోరంబోకు భూములు, డొంకపోరంబోకు భూములు, తాడికొండ అక్కదేవత చెరువును పూడ్చి నిర్మాణాలు చేపట్టారు. పేదలమంటూ నమ్మకంగా చిన్న చిన్న గుడిసెలు వేసుకొని.. కొద్ది రోజులకు రేకుల షెడ్లు నిర్మిస్తున్నారు. అప్పుడప్పుడు రెవెన్యూ సిబ్బంది తూతూ మంత్రంగా ఆక్రమణల వద్దకు వెళ్లి స్థలాలను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారు. రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పట్టీపట్టనట్లు వ్యవహరించడంతోనే అక్రమార్కులు తమ ఇష్టానుసారం ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేస్తున్నారు. బడేపురం శివారులోని డొంక పొరంబోకులో అక్రమంగా రేకుల షెడ్డుతో పాటు, మరో నాలుగు గుడిసెలను నిర్మించారు. వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకుడి అండదండలతోనే ఈ అక్రమ నిర్మాణాలు జరిగాయి. తాడికొండలోని అక్కదేవత చెరువులో అక్రమ నిర్మాణాలు చేపట్టారు. మంగళగిరికి చెందిన ఓ వ్యక్తి తాడికొండలోని కొండ వెనుక స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. వారికి పంచాయతీ నుంచి ఇంటి పన్నులు ఇస్తున్నారు. వాటితో రిజిస్ట్రేషన్లు చేయించుకొని ఒరిజినల్ డాక్యుమెంట్లు సృష్టిస్తున్నారు. దీంతో రెవెన్యూ అధికారులు, పంచాయతీ అధికారులు నోటీసులు జారీ చేయటంతో కోర్టులను ఆశ్రయిస్తున్నారు. అంతేగాకుండా పంట కాల్వలను పూడ్చివేస్తున్నా పట్టించుకోకుండా రెవెన్యూ, పంచాయతీ అధికారులు కాలయాపన చేస్తున్నారు. రాజధానికి కూతవేటు దూరంలో ఉన్న తాడికొండ మండలంలో భూముల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. దీంతో గజం విలువ రూ.25 వేల నుంచి రూ.50 వేలు పలుకుతుంది. దీన్ని ఆసరగా చేసుకొని ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములను కబ్జా చేసి విక్రయించుకుంటున్నారు. రియల్ ఏస్టేట్ వ్యాపారం చేసే వారు సైతం పంట కాల్వల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వర్షం నీరు సక్రమంగా వెళ్లకుండా పంట పొలాల్లోకి, రోడ్ల పైకి వచ్చేస్తున్నాయి. సీఆర్‌డీఏ అధికారులు అక్రమ వెంచర్లపై పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. పంట కాల్వల్లో నిర్మాణాలు చేస్తున్న పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఆవైపు కన్నెత్తి చూడటం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడునెలలు గడుస్తున్నా అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు.



అక్కదేవత చెరువులో అక్రమ నిర్మాణాలు

'ఏపీ గెట్ హెల్దీ' నినాదంతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

● త్వరలో గుండె, ఊపిరితిత్తుల మార్పిడి సర్జరీలు
● టెలి ఐసీయూ ద్వారా రంపచోడవరం, పాడేరులో వైద్యసేవలు
● ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ పోతినేని రమేష్‌బాబు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్‌బాబు

గుంటూరు మెడికల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఏపీ గెట్ హెల్దీ' అనే నినాదంతో కోస్టల్ కారిడార్‌లో గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరులలో 925 పడకలతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సూ పర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాల జిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఆదివా రం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లా డారు. ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే మూడో అతి పెద్ద దిగ్గజ సంస్థలైన ఆస్టర్, డీఎం హెల్త్ కేర్, కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నిష్ణాతులైన వైద్యబృం దంతో అత్యాధునిక చికిత్సలను ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. టావి, మైట్రా క్లిప్ వంటి గుండె శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా ఇంటర్వెన్షనల్ విధానంలో చికిత్సలను ఏపీలో గుంటూరులో మొట్టమొదటిసారిగా చేసినట్లు ఆయన చెప్పారు. ఇప్పటివరకు 30 కిడ్నీ, కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేశామని, త్వరలో గుండె మార్పిడి, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్ర చికిత్సలను అందుబాటులోకి తెస్తామని డాక్టర్ రమేష్‌బాబు వెల్లడించారు. వైద్యరంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ పెంచడంలో భాగంగా అత్యా ధునిక డ్రోన్ సేవలను తమ ఆస్పత్రిలో త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. క్లౌడ్ డాక్ రమేష్ అనే టెలి ఐసీయూ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ సహకారంతో మారు మూల గిరిజన ప్రాంతాలైన రంపచోడ వరం, పాడేరులో అత్యవసర వైద్య సేవలు త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను మారు మూల ప్రాంతాలకు అందుబాటులోకి తెస్తున్నట్లు ఆయన చెప్పారు. 5జీ అంబులెన్స్‌ల ద్వారా రోగి తరలింపు సమయంలో రియల్ టైమ్ మానిట రింగ్ అందుబాటులోకి తెచ్చామని, దీని వల్ల రోగి తర లింపు సమయంలో మరణాల రేటు గణనీయంగా తగ్గించగలమని డాక్టర్ పోతినేని రమేష్‌బాబు తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా 20 వేల మందికిపైగా గుండె వైద్య చికిత్సలు అందించినట్లు ఆయన వివరించారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యసేవకే పరిమితం కాకుండా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గుర్తింపుతో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులకు వైద్య విద్యను అందించే అతి పెద్ద అకడమిక్ ఇనిస్టిట్యూట్‌గా ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందినట్లు ఆయన తెలిపారు. హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవం సందర్భంగా గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు తదితర 25 ఔట్ రీచ్ సెంటర్లలో ప్రతి మంగళవారం ఉచిత కన్సల్టేషన్, రాయితీలతో వైద్యపరీక్షలు అందించేందుకు నిర్ణయించినట్లు ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ రమేష్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో ఆస్పత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

హైందవ శంఖారావానికి తరలివెళ్లిన ప్రజలు



పెదనందిపాడు నుంచి హైందవ శంఖారావానికి తరలివెళ్తున్న ప్రజలు

పెదనందిపాడు, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఆయా గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో హిందూ సమాజం వారు కేసరపల్లిలో జరిగిన హైందవ శంఖారావానికి ఆదివారం తరలివెళ్లారు. గ్రామాల్లో ఆయా బస్సుల్లో భజన సమాజాలు, హిందూ భక్తులు ఆయా దేవస్థానాల వద్ద పూజలు చేసి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● **వట్టిచెరుకూరు:** ఎన్టీఆర్ జిల్లా గన్నవరం సమీపంలోని కేసానుపల్లి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న హైందవ శంఖారావానికి సమరసత సేవాఫౌండేషన్ సభ్యులు మండల వ్యాప్తంగా 27బస్సులతో తరలివెళ్తున్నట్లు పొన్నూరు ఖండ ధర్మ ప్రచారక్ శివయ్య, మండల కన్వీనర్ దాసరి శివన్నారాయణ, మహిళా కన్వీనర్ కోటేశ్వరమ్మ, అమ్మమ్మ ఆధ్వర్యంలో బస్సులు తరలి వెళ్లాయి.



వట్టిచెరుకూరు నుంచి తరలివెళ్తున్న సమరసత సేవాఫౌండేషన్ సభ్యులు

● **దుగ్గిరాల :** మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన హిందువులు హైందవ శంఖారావానికి తరలివెళ్లారు. దుగ్గిరాలకు చెందిన చుండూరు ఉమామహేశ్వరరావు, పసుపులేటి గణేష్, కోనంకి కృష్ణ తదితరుల నేతృత్వంలో పెద్దసంఖ్యలో బస్సుల్లో తరలివెళ్లారు.

దోస్త్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు ప్రారంభం



దోస్త్ ఆధ్వర్యంలో క్రికెట్ ఆడుతున్న క్రీడాకారులు

దుగ్గిరాల, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని ఒన్ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా క్రికెట్‌లీగ్ పోటీలు శనివారం ప్రారంభమైన విషయం విదితమే.. పన్నెండేళ్లుగా దోస్త్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగకు ముందు క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నారు. రెండోరోజు ఆదివారం జరిగిన తొలిమ్యాచ్‌లో ఫ్రెం డ్స్-11, సీసీఎల్ టీమ్‌తో తలపడగా ఫ్రెండ్స్ -11 ఒకవికెట్‌తో గెలుపొందింది. ఈమని స్పాట్ మిరకిల్స్, చింతలపూడి- 9 టీమ్‌తో తలపడ గా ఈమని స్పాట్ మిరకిల్స్ టీమ్ గెలు పొందింది. దుగ్గిరాల ఆలీబాయ్ -9తో ఎన్‌సీ యూత్ దుగ్గిరాల టీమ్‌తో తలపడగా ఎన్‌సీ యూత్ గెలుపొందింది. చంటి ఎఫ్‌సీ దుగ్గి రాల, మోరంపూడి దినేష్ టీమ్‌తో తలప డగా చంటి ఎఫ్‌సీ దుగ్గిరాల గెలుపొందింది. థండర్స్ స్ట్రైకర్స్ దుగ్గిరాల, ఎస్‌ఏ యూత్ దుగ్గిరాలతో తలపడగా ఎస్‌ఏ యూత్ దుగ్గిరాల టీమ్ గెలుపొందింది. దోస్త్ కమిటీకి చెందిన ఎన్నారై జంపాల సుబ్బారావు, గద్దె శ్రీనివాస్, కొండపనేని రవీంద్ర, వల్లూరు నరసింహారావు, పర్వతనేని హర్ష, సాయి కిరణ్, నక్కా చిరంజీవి, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

33వ రోజుకు చేరుకున్న ఏసీసీ కార్మికుల దీక్షలు



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

తాడేపల్లి టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏసీసీ సిమెంటు కార్మికులు చేస్తున్న రిలే దీక్షలు ఆదివారంతో 33వ రోజుకు చేరుకున్నాయి. ఈ రిలే దీక్షలను సీఐటీయూ నేత వేముల దుర్గారావు, రాచకొండ శివ ప్రారంభించారు. వేముల దుర్గారావు మాట్లాడుతూ ఇప్పటికే 171 మంది ఏసీసీ కార్మికులు అనారోగ్యానికి గురై ఆర్థిక ఇబ్బందులతో మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు మంత్రి లోకేశ్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యెహోషువ, పిచ్చయ్య, ఇస్మాయెల్, సక్రు నాయక్, నవనీతం, ఏఐఎఫ్‌టీయూ నేత కే ఆదినారాయణ, యూని యన్ నేత కే స్టీవెన్, సూర్యప్రకాష్, అంకయ్య, ఆశీర్వాదం, శారద, దుర్గాభవాని, లక్ష్మి, శారమ్మ, దుర్గారావు రమణ తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు


● బహిరంగంగా మద్యం తాగితే కేసు నమోదు

● కోడి పందాలపై ఉక్కుపాదం : సీఐ గంగా వెంకటేశ్వర్లు

తుళ్లూరు, జనవరి 5: (ఆంధ్రజ్యోతి) అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట రీత్యా కఠిన చర్యలుంటాయని తుళ్లూరు సీఐ గంగా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోడి పందాలపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మండలంలో ఎక్కడ పందెం కోళ్లు కనపడినా స్వాధీనం చేసుకొని కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎక్కడ పడితే అక్కడ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే అరెస్టులు చేసి కోర్టుల్లో హాజరు పరుస్తామని హెచ్చరించారు. ఎటువంటి అసాంఘిక కార్యకలపాలకు చోటు లేదని వివరించారు. గంజాయి విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ పేర్కొన్నారు. ప్రత్యేక నిఘాపెట్టి, దొరికిన వారిపై నాన్ బెయిల్‌బుల్ సెక్షన్‌ల కింది కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

నిరుద్యోగ భృతి తక్షణమే అమలు చేయాలి

● ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే వలి



సమావేశంలో పాల్గొన్న ఏఐవైఎఫ్, సీపీఐ నాయకులు

మంగళగిరి సిటీ, జనవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు రూ.3 వేల చొప్పున నిరుద్యోగ భృతిని వెంటనే అమలు చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌కే వలి డిమాండ్ చేశారు. మంగళగిరి సీపీఐ కార్యాలయంలో ఆదివారం జరిగిన ఏఐవైఎఫ్ నియోజకవర్గ మహాసభలో ఆయన ప్రసంగించారు. వలి మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, వారి సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వాలు మారుతున్నా యువత మాత్రం పాలకుల మాటలు నమ్మి మోసపోతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి 2.65 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని చెప్పి నిరుద్యోగులను దారుణంగా మోసం చేసి, చివరికి తానే నిరుద్యోగిగా మిగిలిపోయారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండా తాత్సారం చేస్తుందని, వలంటీర్లకు రూ.పది వేల జీతం ఇస్తామని చెప్పి వారిని విధుల నుంచి తొలగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి, తల్లికి వందనం, మహిళలకు ఉచిత బస్సు పథకాలను తక్షణమే అమలుచేయాలని డిమాండ్ చేశారు. మహాసభ అనంతరం ఏఐవైఎఫ్ నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇంటూరి గోపీరాజ్, ప్రధాన కార్యదర్శిగా జాలాది నవీన్, ఉపాధ్యక్షుడిగా కంచర్ల క్రాంతి, సహాయ కార్యదర్శిగా ఉయ్యాల నరసింహులను ఎన్నుకున్నట్టు ప్రకటించారు. సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్న వరపు ప్రభాకర్‌రావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు జంగాల చైతన్య, కంచర్ల కాశయ్య, జాలాది విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని వ్యతిరేకించాలి : సీపీఎం

తాడేపల్లి టౌన్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): మతోన్మాద బీజేపీని వ్యతిరేకించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థకు ఆ పార్టీ తూట్లు పొడుస్తుందని సీపీఎం పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని అమరారెడ్డి సెంటర్, నేతాజీ సెంటర్లో సీపీఎం శ్రేణులు మత సామరస్యాన్ని భారత రాజ్యాంగాన్ని కాపాడాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం నిర్వహించారు. బూరగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ భారత రాజ్యాంగానికి బీజేపీ హయాంలో పెనుముప్పు ఏర్పడిందని దాన్ని కాపాడు కోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. విద్యుత్ అదనపు చార్జీలు తగ్గించాలని టీడీపీ ప్రభుత్వం కూడా మాట తప్పి, మడమ తిప్పిందని వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు దొంతిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మోదుగుల శ్రీనివాసరెడ్డి, దర్శనపు విజయబాబు, కోట బాబూరావు, బాబ్జీ, మేరి, దావీదు పాల్గొన్నారు.

గ్రంథాలయ పనివేళల్లో మార్పు



గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు



పనివేళలు పొడిగిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు

మంగళగిరి సిటీ, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి మెట్ల మార్గంలోని శివాలయం పక్కన గల శాఖా గ్రంథాలయం పనివేళల్లో మార్పు చేశారు. ఇకపై ఉదయం 7నుంచి రాత్రి పదిగంటల వరకు గ్రంథాలయం తెరిచి ఉంటుంది. వివిధ రకాల పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు ఈ మార్పులు చేశారు. మార్పు చేసిన పనివేళలు తమకు ఎంతో సౌకర్యంగా ఉంటాయని అభ్యర్థులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. తమ సమస్యను గుర్తించి లైబ్రరీ పనివేళల్లో మార్పులు చేయడంపై పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, విద్యార్థులు, పాఠకులు మంత్రి నారాలోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజలతో స్నేహ భావంతో మెలగాలి : డీఎస్పీ

వట్టిచెరుకూరు, జనవరి 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని ప్రజలతో మమేకమై స్నేహభావంతో మెలగటం ద్వారా ప్రజల మన్ననలను పొందవచ్చని సౌత్ డీఎస్పీ మల్లికార్జునరావు సూచించారు. వట్టిచెరుకూరులోని పోలీసుస్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా ఆదివారం సందర్శించి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నిత్యం గ్రామాల్లో ప్రత్యేక నిఘా పెంచటం ద్వారా అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చని, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహిస్తే సహించవద్దని మల్లికార్జునరావు అన్నారు. మండలంలోని రౌడీషీటర్ల పూర్తి సమాచారం వారి కార్యకలాపాలపై దృష్టి పెట్టాలన్నారు. ఎలాంటి ఫిర్యాదు వచ్చినా అర్జీదారుల నుంచి పూర్తి సమాచారం తీసుకొని అలాంటి వారిని ఆప్యాయంగా వారి కష్టాలను వినటం ద్వారా వారికి సరైన న్యాయం జరుగుందనే భరోసా ప్రజల్లో కల్పించవచ్చన్నారు. సీఐ రమానాయక్, ఎస్ఐ సుబ్బారావు, ఇతర సిబ్బందిని, వారి యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పుల్లడిగుంటలో సంక్రాంతి కానుకల పంపిణీ



ఉప్పుటూరి చిన రాములు సేవా ట్రస్ట్ ద్వారా సంక్రాంతి కానుకల పంపిణీ

వట్టిచెరుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పుల్లగుడిగుంట గ్రామంలోని అన్న క్యాంటీన్ వద్ద ఆదివారం ఉప్పుటూరి చిన రాములు సేవా ట్రస్ట్ ద్వారా ఎన్ఆర్ఐ ఉప్పుటూరి రామ్‌చౌదరి తన తల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పుటూరి సీతా మహాలక్ష్మి జ్ఞాపకార్థం ప్రతి సంవత్సరం సంక్రాంతి కానుకల పంపిణీని యథావిధిగా కొనసాగిస్తున్నట్టు వెల్లడించారు. గ్రామంలోని రెండు వందల కుటుంబాలకు సంక్రాంతి కానుకగా కేజీ నెయ్యి, రెండు కేజీల బెల్లం కిట్‌ను తన తండ్రి చినరాములు, గ్రామానికి చెందిన గుంటుపల్లి సదాశివరావుతో కలిసి అందజేశారు.

గ్రామాల్లో హరిదాసుల సందడి



హరి కీర్తన ఆలపిస్తూ ధర్మం స్వీకరిస్తున్న హరిదాసు

వట్టిచెరుకూరు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం నెల రోజులు ఎంతో పవిత్రమైన నెలగా విష్ణు ఆలయాల్లో హరినామ స్మరణలతో భక్తులు కీర్తనలను ఆలపిస్తున్నారు. పురాతన కాలం నుంచి వారసత్వంగా హరిదాసులు తెల్లవారుజామునే గ్రామాలకు చేరుకొని హరి కీర్తనలు ఆలపిస్తూ ప్రతి ఇంటి వద్ద వారిచ్చే ధర్మాన్ని స్వీకరిస్తూ హరిలో రంగ హరి అంటూ శ్లాఘించటం ఆచారంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా హరిదాసు గ్రామాల్లో నెల రోజుల పాటు హరినామ స్మరణను ఆలపిస్తూ కొనసాగుతామని వారు వెల్లడిస్తున్నారు. ఈనెల 14వ తేదీ సంక్రాంతి వరకు హరిదాసులు గ్రామాల్లో హరినామ స్మరణలతో తిరుగుతుంటారు. సంక్రాంతి సందర్భాన్ని పురస్కరించుకొని పిండి వంటలు తయారు చేసేందుకు మహిళలు అవసరమైన సరుకులను సేకరించి అరిశలు, చక్రాలు, లడ్లు, తదితర పిండి వంటలను తయారు చేస్తున్నారు.

సేంద్రియ వ్యవసాయ విధానాలను ఆచరించాలి



మాట్లాడుతున్న డాక్టర్ శివన్నారాయణ, పాల్గొన్న శాస్త్రవేత్తలు, విద్యార్థులు

గుంటూరు(తూర్పు), జనవరి 5(ఆంధ్రజ్యోతి): సేంద్రియ వ్యవసాయ విధానాలను ఆచరించి సాగు ఖర్చు తగ్గించుకుని, అధిక దిగుబడులు సాధించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ, వ్యవసాయ విస్తరణ అధికారి జీ శివన్నారాయణ అన్నారు. గుంటూరు రూరల్ మండలంలో జొన్నలగడ్డ గ్రామంలో ఏరువాక కేంద్రం ఆధ్వర్యంలో బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా రైతుసదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ పైరుపై కృత్రిమ ఎరువుల వాడకం తగ్గించి, పచ్చి రొట్ట ఎరువులను వినియోగించాలన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల, అసోసియేట్ డీన్ పీ ప్రసున్నరాణి మాట్లాడుతూ మూడు నెలల నుంచి విద్యార్థులు శిక్షణలో పాల్గొన్నారని అన్నారు. రైతులు ఆచరిస్తున్న వ్యవసాయ విధానాలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర కో ఆర్డినేటర్ ఎన్ వెంకటలక్ష్మి, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎన్ వెంకట్రామ్, జొన్నలగడ్డ గ్రామ మాజీ ఉప సర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు

గాయపడ్డ కోతికి వైద్య చికిత్స

తెనాలి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కొలకలూరులో విద్యుత్ తీగలపై గెంతుతూ విద్యుదాఘాతానికి ఓ కోతి గురైంది. కిందపడి గిలగిల కొట్టుకుంటున్న కోతిని చూసి స్థానికులు అదే ప్రాంతానికి చెందిన వెటర్నరీ వైద్యుడు డాక్టర్ ఆలపాటి వెంకట్రావుకు సమాచారం అందించారు. పశు వైద్యుడు వెంటనే వచ్చి కోతికి చికిత్స అందించడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిన కోతి తిరిగి ఊపిరి పోసుకుంది. మూగజీవి బాధను గుర్తించి చికిత్స అందించిన స్థానికులను పలువురు అభినందించారు.

సంప్రదాయాలకు ప్రతిబింబం రంగవల్లులు

● మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ రాజకుమారి

● ఏబీఎన్, ఆంధ్రజ్యోతి ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన

● తెనాలిలో ముగ్గుల పోటీల స్పాన్సర్ గణేష్ యూత్



ముగ్గుల పోటీల బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న రాజకుమారి, వేదికపై మురళి, సాంబశివరావు, ప్రియబాంధవి, మహాలక్ష్మి



నాల్గో బహుమతి పొందిన మహిళకు బహుమతిని అందజేస్తున్న నన్నపనేని రాజకుమారి, ప్రియబాంధవి, మురళి తదితరులు



తెనాలిలో ముత్యాల ముగ్గులు తీర్చిదిద్దుతున్న మహిళలు



ముగ్గుల పోటీల్లో చిన్నారుల సందడి

తెనాలి, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): తరతరాలుగా వస్తున్న సంస్కృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, దీనిని పరిరక్షించే బాధ్యత, యువతలో సంప్రదాయ విలువలను పెంచి పోషించే బృహత్తర కార్యక్రమాన్ని ఆంధ్రజ్యోతి చేపట్టడం మంచి పరిణామమని మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చెప్పారు. తెనాలి బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, సంతూర్ ముత్యాల ముగ్గుల పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీలకు గార్డెనింగ్ పార్టనర్‌గా క్రాఫ్ట్ వారి ఫర్‌ఫెక్ట్, ష్యాషన్ పార్టనర్‌గా డిగ్‌సెల్ వారి సెల్సియా స్పాన్సర్‌గా వ్యవహరించారు. పోటీలకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి 142మంది మహిళలు హాజరై రకరకాల రంగులతో ముగ్గులు తీర్చిదిద్దారు. ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు పాల్గొని పోటీలను పర్యవేక్షించారు. అనంతరం జరిగిన బహుమతి ప్రదానోత్సవ సభలో రాజకుమారి మాట్లాడుతూ, సంక్రాంతి సంబరం ముందుగానే వచ్చిన అనుభూతి కలిగిందని, ఓర్పుతో మహిళలు తీర్చిదిద్దిన రంగవల్లులు ముచ్చట గొలిపాయన్నారు. సమాజంలో కనుమరుగవుతున్న సంస్కృతి, సాంప్రదాయాలను చూస్తుంటే మనం ఎటు పోతున్నామో అనే భయం కలుగుతుందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయాలకు విలువనిస్తూ రేపటి తరాలకు, ప్రధానంగా యువతలో స్ఫూర్తి కలిగించేలా ముగ్గుల పోటీలను ప్రోత్సహిస్తున్న ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి రాధాకృష్ణ అభినందనీయులన్నారు. వాస్తవాలను నిర్భయంగా సమాజానికి అందించడమే కాక, సంప్రదాయ విలువలకు ప్రాధాన్యం ఇచ్చేలా ఒక పత్రిక పని చేయడం గొప్ప విషయమన్నారు. రానున్న రోజుల్లో ఆంధ్రజ్యోతి మరిన్ని సమాజ శ్రేయస్సుకు ఉపకరించే కార్యక్రమాలను నిర్వహించాలని కోరుకుంటున్నామన్నారు. గత 15 ఏళ్లుగా మొక్కవోని దీక్షతో పోటీలు జరుగుతున్నాయని, దీనికి గణేష్ యూత్ మురళి బృందం సహకారం అందించడం అభినందనీయమన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులను స్పాన్సర్ చేస్తున్న అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి మాట్లాడుతూ, మహిళలను ప్రోత్సహించేందుకు సంక్రాంతి సోయగాలను భావితరాలకు అందించేందుకు ముగ్గుల పోటీలు దోహదపడతాయన్నారు. చిన్నారులు, యువతులు కూడా ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం మంచి పరిణామమన్నారు. పోటీలకు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ కొడాలి వీరయ్య ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి, వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల మహాలక్ష్మి వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. గణేష్ యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, ఎల్ఎంఎల్ ఖాదర్, కె.విష్ణు, గుమ్మడి రవీంద్రలు విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం పొందిన భట్టిప్రోలుకు చెందిన కె.మానసకు రూ.6వేలు నగదు, పట్టుచీర, ద్వితీయ స్థానం పొందిన సోమసుందరపాలెంకు చెందిన ఎస్.లక్ష్మీతిరుపతమ్మకు రూ.4వేలు, పట్టుచీర, తృతీయ స్థానం పొందిన ఈమని గ్రామానికి చెందిన పి.సాయిచైతన్యకు రూ.3వేలు నగదు, పట్టుచీర అందజేశారు. నాల్గో బహుమతి కింద మరో 15మందికి చీరలు, గిఫ్ట్‌ప్యాక్, మరో 25 మందికి 5వ బహుమతి కింద చీరలు, మరో 60మందికి ప్రోత్సాహక బహుమతులుగా చీరలు పంపిణీ చేశారు. తెనాలి చుట్టుపక్కల గ్రామాల నుంచే కాకుండా గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు చెందిన గ్రామాల నుంచి వచ్చిన మహిళలు రెండు గంటల పాటు శ్రమించి రంగవల్లులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలు, చెరుకుగడలు, పాలపొంగులు, హరిదాసుల బొమ్మలు, ధాన్యపు రాశులతో ముగ్గులకు సరికొత్త అందాలు తెచ్చారు.

విజేతలకు రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ చైర్ పర్సన్ నన్నపనేని రాజకుమారి, గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, ఆంధ్రజ్యోతి ఎడిషన్ ఇన్‌చార్జి సూర్యదేవర సాంబశివరావు, యూత్ సభ్యులు కనగాల నాగభూషణం, బొద్దులూరి వేణు, గొల్లపూడి సాయిగిరి, గుమ్మడి రవీంద్ర, న్యాయ నిర్ణేతలు కొడాలి వీరయ్య ఛారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ వాసిరెడ్డి ప్రియబాంధవి, వైష్ణవి జూనియర్ కళాశాల డైరెక్టర్ పాటిబండ్ల మహాలక్ష్మి బహుమతులు అందజేశారు. స్పాన్సర్ల లోగోలను రంగవల్లులుగా తీర్చిదిద్దిన మహిళలకు ప్రత్యేక బహుమతులు అందించారు. తెనాలి ఆంధ్రజ్యోతి సిబ్బంది కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది

● కె మానస



తెనాలి, మారీసుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముత్యాల ముగ్గుల పోటీల్లో తాను గీసిన ముగ్గుకి ప్రథమ బహుమతి రావడం అనందంగా ఉందని భట్టిప్రోలుకు చెందిన కె మానస అన్నారు. సంక్రాంతి పండుగ సంప్రదాయాన్ని ప్రతిబింబిస్తూ మహిళలలో ఉన్న ముత్యాల ముగ్గుల ప్రతిభను వెలికి తీస్తున్న గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, టీం సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మహిళల్లో ప్రతిభను పోత్సహించడం సంతోషకరం

● ద్వితీయ బహుమతి గ్రహీత లక్ష్మీ తిరుపతమ్మ



తెనాలి, మారీసుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో గణేష్ యూత్ సహకారంతో ముత్యాల ముగ్గుల పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉందని సోమసుందరపాలెంకు చెందిన సూరగాని లక్ష్మీ తిరుపతమ్మ చెప్పారు. మహిళలలో దాగిఉన్న ప్రతిభను ప్రోత్సహిస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి, సిబ్బందికి ప్రతేక కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఏడాది ప్రథమ బహుమతే లక్ష్యంగా కృషిచేస్తానన్నారు.

బహుమతి రైతులకు అంకితం

● తృతీయ బహుమతి సాధించిన సాయి చైతన్య



తెనాలి, మారీసుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యాన్ని ఇంటికి తీసుకువస్తూ పండగ సంస్కృతిని ఉట్టిపడేలా వేసిన ముగ్గుకు తృతీయ బహుమతి రావడం చాలా అనందంగా ఉందని ఈ బహుమతిని రైతులకు అంకితం చేస్తున్నానని ఈమని గ్రామనికి చెందిన పుసుపులేటి సాయిచైతన్య అన్నారు. ఎంతోమంది మహిళలు తమ ప్రతిభ చాటడానికి ప్రతిఏటా ఒకే వేదికపై ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్న ఏబీఎన్ ఆంధ్రజ్యోతి, బహుమతులు స్పాన్సర్ చేస్తున్న అంగలకుదురు గణేష్ యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి, టీం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

దివ్యాంగురాలికి చీర బహూకరణ

తెనాలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ముగ్గుల పోటీలు తిలకించేందుకు వచ్చిన దివ్యాంగురాలికి చీర బహూకరించారు. తెనాలిలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ముగ్గులు పోటీల్లో వేసిన ముగ్గులు చూసి దివ్యాంగురాలు ఆనందం వ్యక్తం చేసింది. తనకు అన్ని అవయవాలు పనిచేసి ఉంటే ఈ పోటీలో పాల్గొని ఉండేదాన్ని అని భావోద్వేగానికిలోనైంది. గమనించిన గణేష్‌యూత్ కన్వీనర్ వీరవల్లి మురళి ఆమె వద్దవకు వెళ్లి పోటీల్లో పాల్గొనకున్నా ముఖ్యఅతిథి మాజీ మంత్రి, మహిళా కమిషన్ మాజీ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి చేతులమీదుగా ప్రత్యేక బహుమతిగా చీరను అందించారు.



దివ్యాంగురాలికి చీరను అందిస్తున్న రాజకుమారి, వీరవల్లి మురళి, నాగభూషణం తదితరులు

దశావతారునికి రూ.లక్ష విరాళం అందజేత

● ఆలయంలో నిత్యాన్నదానానికి వినియోగించాలని విజ్ఞప్తి



విరాళాలు అందజేస్తున్న దాతలు

పెదకాకాని, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వేంకటేశ్వర స్వామి వారి దివ్య క్షేత్రంలో జరుగుతున్న నిత్య అన్నదాన పథకానికి దాతలు రూ.లక్ష రూపాయల విరాళాన్ని ఆదివారం ఆలయ మేనేజర్ వెంకటేశ్వరరావుకు అందజేశారు. ఈ మేరకు విజయవాడ నగరానికి చెందిన లింగమనేని రత్నాకర్, సుధ దంపతులు ఈ విరాళాన్ని చెక్కుగా అందజేశారు. దాతలను ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించారు.

శ్రీ శివముక్కోటి జంగమదేవర అన్నదాన సమాజం నూతన అధ్యక్షుడిగా బదరీనారాయణరావు

తెనాలి, మారీసుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): శ్రీశివముక్కోటి జంగమదేవర అన్నదాన సమాజం నూతన అధ్యక్షుడిగా మేడా బదరీనారాయణరావు ఎన్నికయ్యారు. ఆదివారం శ్రీశివముక్కోటి జంగమదేవర అన్నదాన సమాజం కార్యదర్శి వీవీ సుబ్బారావు కార్యాలయంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా మేడా బదరీ నారాయణరావు, ఉపాధ్యక్షుడిగా వేమూరి సుబ్బారావు, సహాయ కార్యదర్శి పెండేల సుబ్బారావు, కోశాధికారి ఉప్పల వరదరాజులు, సభ్యులుగా యక్కల మాల్యాద్రి, నేలవల్లి చంద్రకిరణ్, దర్శి కోటి రత్నాకర్, జంధ్యాల సుబ్రహ్మణ్యం, పెనుమూడి పవన్ కుమార్, గుర్రం భాస్కర వెంకట సుధీర్‌లను ఎన్నకున్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాలరాస్తున్న అధికారులు

● సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ

చేబ్రోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను అధికారులు కాలరాస్తున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండ లక్ష్మీనారాయణ ఆరోపించారు. ఆదివారం చేబ్రోలు పంచాయతీ కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కార్మికుల సంక్షేమాన్ని పంచాయతీ అధికారులు గాలికి వదిలేశారని ఆరోపించారు. కార్మిక చట్టాలను ఉల్లంఘిస్తూ అణిచివేత ధోరణికి పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్మికులపై వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. తక్షణమే నిబంధనలకు విరుద్ధంగా తొలగించిన కార్మికులను తిరిగి విధులలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి చింతల శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి సీహెచ్ హనుమంతరావు, రాఘవమ్మ, పార్వతి, వెంకాయమ్మ, సరళ, జ్యోతి, దివ్యశ్రీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవులకు తీరని ద్రోహం చేసిన జగన్‌రెడ్డి

● జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి

పొన్నూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 98 శాతం క్రైస్తవులు నమ్మి జగన్‌కు ఓటువేస్తే తీరని ద్రోహం చేశారని జీసస్ బిలీవర్స్ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ మోసిగంటి ఆదివారం ఆరోపించారు. హైందవులను జగన్ ప్రభుత్వ పాలనలో చిన్నచూపు చూశారని హైందవ సమాజం ఆరోపిస్తుందన్నారు. హైందవులను చిన్నచూపు చూశారేమో కానీ క్రైస్తవులకు మాత్రం తీరని ద్రోహం చేవారని ఆరోపించారు. సొంత చెల్లికి తల్లికి మతానికి మేలు చేయలేదని ఆరోపించారు. ఉచిత పథకాలు ఇచ్చి ఓట్లు వేయించుకోవాలని జగన్ రెడ్డి చూశారని దుయ్యబట్టారు. హైందవ ఓట్లు ఆకర్షించడానికి అనేక హైందవ కార్యక్రమాల్లో జగన్ పాల్గొన్నారన్నారు. కూటమి ప్రభుత్వానికి గత ఎన్నికల్లో క్రైస్తవులు మద్దతు పలికారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వం నామినేటెడ్ పదవులను క్రైస్తవ సమాజానికి సేవ చేసిన వారికి పదవులు ఇవ్వాలని జోసఫ్ మోసిగంటి విజ్ఞప్తి చేశారు.

వైభవంగా సుందరకాండ మహాయజ్ఞం

తెనాలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగలకుదురులోని ఆంధ్ర వాల్మీకి శ్రీవాసుదేవస్వామి, శ్రీదాస శేషస్వామి వార్ల పరంపర పీఠం దాసకుటి ఆశ్రమంలో ఆదివారం సుందరకాండ మహాయజ్ఞం, హోమం వైభవంగా నిర్వహించారు. హైదరాబాద్‌కు చెందిన హనుమ ఉపాసకులు శ్రీమాన్ గుంటూరు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు వేద పండితులు కలిసి ఉదయం హోమ పూజలు ప్రారంభించారు. పరిసర గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఉలిచి సీతారామశర్మ (పట్టాభి) కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

'ఏపీ గెట్ హెల్తీ' నినాదంతో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు

ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ ఎండీ రమేష్‌బాబు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పోతినేని రమేష్ బాబు

గుంటూరు మెడికల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): 'ఏపీ గెట్ హెల్తీ' అనే నినాదంతో కోస్టల్ కారిడార్‌లో గుంటూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరులలో 925 పడకలతో ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందిస్తున్నట్లు ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోతినేని రమేష్‌బాబు వెల్లడించారు. గుంటూరులోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. రమేషబాబు మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణలో దేశంలోనే మూడవ అతిపెద్ద దిగ్గజ సంస్థలైన ఆస్టర్, డీఎం హెల్త్ కేర్, కేర్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో నిష్ణాతులైన వైద్యబృందంతో అత్యా.దునిక వైద్య చికిత్సలను ఆంధ్రప్రదేశ్‌లో అందిస్తున్నట్లు తెలిపారు. టావి, మైట్రా క్లిప్ వంటి గుండె శస్త్రచికిత్సలకు ప్రత్యామ్నాయంగా ఇంటర్వెన్షనల్ విధానంలో చికిత్సలను ఏపీలో గుంటూరులో మొట్టమొదటిసారిగా చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 30 కిడ్నీ, కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేశామని, త్వరలో గుండె మార్పిడి, ఊపిరితిత్తుల మార్పిడి శస్త్రచికిత్సలను అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. వైద్య రంగంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ పెంచడంలో భాగంగా అత్యాధునిక డ్రోన్ సేవలను తమ ఆసుపత్రిలో త్వరలో ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు. 'క్లౌడ్ డాక్స్ రమేష్' అనే టెలి ఐసీయూ ప్రాజెక్ట్ ద్వారా ప్రభుత్వ సహకారంతో మారుమూల గిరిజనప్రాంతాలైన రంపచోడవరం, పాడేరులో అత్యవసర వైద్యసేవలు త్వరలో ప్రారంభించబోతున్నట్లు తెలిపారు. 5జీ అంబులెన్స్‌ల ద్వారా రోగి తర లింపు సమయంలో రియల్ టైమ్ మానిటరింగ్ అందు బాటులోకి తెచ్చామని, దీని వల్ల రోగి తరలింపు సమయంలో మరణాల రేటు గణనీయంగా తగ్గించగలమని రమేష్‌బాబు తెలిపారు. ఆస్టర్ రమేష్ హాస్పిటల్స్ వైద్యసేవకే పరిమితం కాకుండా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ గుర్తింపుతో స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులకు వైద్య విద్యను అందించే అతి పెద్ద అకడమిక్ ఇనిస్టిట్యూట్‌గా ఆంధ్రప్రదేశ్‌లో గుర్తింపు పొందినట్లు తెలిపారు.

హాస్పిటల్స్ 36వ వార్షికోత్సవం సందర్భంగా గుం టూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు తదితర 25 ఔట్ రీచ్ సెంటర్లలో ప్రతి మంగళవారం ఉచిత కన్సల్టేషన్, రాయితీలతో వైద్యపరీక్షలు అందిం చేందుకు నిర్ణయించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి, గ్రూప్ బిజినెస్ హెడ్ డాక్టర్ కార్తీక్ చౌదరి పాల్గొన్నారు.

తెలుగు భాష ఉన్నతికి పాటుపడిన సంస్కృత కళాశాల

● డాక్టర్ వేదాల వెంకట సీతారామాచార్యులు



వేదాల వెంకట సీతారామచార్యులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

పొన్నూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): సరస్వతీపుత్రులను సమాజానికి అందించి తెలుగు భాష ఉన్నతికి సాక్షి భావనారాయణ స్వామి సంస్కృత కళాశాల కారణమైందని విశ్రాంత ప్రధాన ఆచార్యులు డాక్టర్ వేదాల వెంకట సీతారామాచార్యులు అన్నారు. స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఆదివారం భావనారాయణస్వామి సంస్కృత కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. సంస్కృత కళాశాలలో విద్యనభ్యసించి దేశంలో పలు ప్రాంతాలో స్థిరపడిన తెలుగు బాషా పండితులు ఈ సమ్మేళనంలో పాల్గొన్నారు. విద్యనభ్యసించిన చిన్ననాటి సంగతులను మననం చేసుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీతారామాచార్యులు మాట్లాడుతూ సంస్కృత కళాశాల గొప్పతనం ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం సంస్కృత కళాశాల పాటు పడిందన్నారు. ఇక్కడ విద్య నభ్యసించిన ఎందరో విద్యార్థులు అష్టావధానులుగా శతావధానులుగా కీర్తి ప్రతిష్టలు పొందారని కొనియాడారు. తెలుగు పండితుల శిష్యరికంలో ఈ కళాశాల ఎందరినో తెలుగు పండితులుగా తీర్చిదిద్దుందన్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు ఆచార్య గురువు వేదాల సీతారామాచార్యులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

11న సేంద్రియ వ్యవసాయంపై అవగాహన


తెనాలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖాజీపేటలో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయంపై ఈ నెల 11న ఉదయం 9.30 నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలంగాణ స్టేట్ జీఎస్టీ జాయింట్ కమిషనర్ యడ్ల శ్రీలీల ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయంలో చీడపీడల నివారణకు పురుగు మందుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి సహజంగా తయారుచేసే ఉత్పత్తుల ద్వారా రక్షించుకునేలా రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. దీనిని శ్రీభారత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సస్యశ్యామలం పేరుతో సుభాష్ పాలేకర్ కృషి విధాన సాధకులు విజయరామ్‌తో రైతులకు సమగ్రంగా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొనే రైతులు తమ పేర్లను ఫోన్ నెంబర్లు 8978724882, 9052275608, 8500617426 సంప్రదించి నమోదు చేయించుకోవాలన్నారు.

జూదరుల అరెస్టు

తెనాలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొలవరంలో పేకాడుతున్న జూదరులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ ప్రతాప్‌కుమార్ తెలిపారు. గ్రామంలో ఓ ఇంట్లో పేకాడుతున్నారని పక్కా సమాచారంతో ఆదివారం దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో పేకాడుతున్న ఆరుగురును అదుపులోకి తీసుకుని వారి వద్ద రూ.10200 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

మేదర సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

తెనాలి అర్బన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ మేదర సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం నిర్వహించారు. బాలాజీరావుపేటలోని రామస్వామి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడిగా కె.యోగేష్, ప్రధాన కార్యదర్శిగా పి.వెంకట్రావు, కోశాధికారిగా లీలాప్రసాద్, సభ్యులుగా హనుమాన్ ప్రసాద్, మాణిక్యరావు, రాఘవులు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, నాగమోహన్, రాంబాబు, శరత్‌బాబులు పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని మేదరుల సంక్షేమానికి కృషి చేస్తామన్నారు.



సీనియర్ ఆర్ఎంపీలను సత్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీల సేవలు నిరుపమానం

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

తెనాలి రూరల్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు అందిస్తున్న సేవలు నిరుపమాపమని, వారికి ప్రభుత్వం ద్వారా గుర్తింపు వచ్చేలా కృషి చేస్తామని మాజీ మంత్రి, గుంటూరు, కృష్ణ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రైల్వేస్టేషన్ రోడ్డులో ఓ హోటల్‌లో ఆర్ఎంపీ, పీఎంపీల 41వ మహాసభను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మె ల్సీ రాయపాటి శ్రీనివాసరావులు పాల్గొని ఆర్ఎంపీ, పీఎంపీల సేవలను కొనియాడారు. సీనియర్ ఆర్ఎంపీ, పీఎంపీలను సభలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందించారు. ఆర్ఎంపీ, పీఎంపీ అధ్యక్షులు నారాయణం వేణుగోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా స్థాయిలో ఆర్ఎంపీ, పీఎంపీలు పాల్గొన్నారు.

వృద్ధాశ్రంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): బుర్రిపాలెం రోడ్డులోని శ్రీమహాత్మాగాంధీ శాంతి ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం తాళ్లూరి నాగేశ్వరరావు వర్ధంతి సందర్భంగా వారి భార్య లక్ష్మి, కుటుంబసభ్యులు ఆశ్రమంలోని వృద్ధులకు పండ్లను పంపిణీ చేసి అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, ఎసీవీ యోగా కన్వీనర్ ఎం రమణయ్య, వై కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు టీడీపీ నేతల నివాళి



టీడీపీ కార్యకర్త గోపాలకృష్ణకు నివాళి అర్పిస్తున్న నాయకులు

పొన్నూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మాచవరం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త గుడిపాటి గోపాలకృష్ణ ఆదివారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాల మేరకు టీడీపీ నాయకులు గోపాలకృష్ణ మృతదేహాన్ని సందర్శించి నివాళి అర్పించారు. గోపాలకృష్ణ కుటుంబ సభ్యులను టీడీపీ నాయకులు మాదాల వెంకటేశ్వరరావు, బొర్రు రామారావు, బండ్లమూడి బాబురావు తదితరులు పరామర్శించి సంతాపం తెలిపారు.



కవి రహీం సాహెబ్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

రహీం సాహెబ్‌కు కవి సత్కారం

పొన్నూరు టౌన్, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు పట్టణానికి చెందిన కవి గాయకుడు, ఆర్టీసీ కండక్టర్ షేక్ రహీం సాహెబ్ కవి సత్కారం అందుకున్నారు. ఆదివారం విజయవాడలో ఠాగూర్ గ్రంథాలయంలో తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ జానపద సంక్రాంతి జాతీయ కవి సమ్మేళనం నిర్వహించింది. రహీం సాహెబ్ రచించి ఆలపించిన సంక్రాంతి సంబరాలు కవిత గానం ఆహుతులను రంజింపజేసింది. ఈ సందర్భంగా సేవా సంస్థ నిర్వాహకులు ఎంవీ రత్నం బి.ఉషారాణి తదితరులు రహీంసాహెబ్‌ను సత్కరించి అభినందించారు.

హైందవ శంఖారావ సభకు తరలిన శలపాడు వాసులు

చేబ్రోలు, జనవరి 5 (ఆంధ్రజ్యోతి): విజయవాడ గన్నవరంలో జరిగిన హైందవ శంఖారావ సభకు ఆదివారం మండల పరిధిలోని శలపాడు గ్రామానికి చెందిన హిందువులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. గ్రామంలోని రామాలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం వాహనంలో విజయవాడ తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రామ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.